

పెరియార్ గ్రంథాలయం, వైజ్ఞానిక కేంద్రానికి శంకుస్థాపన చేస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

అభివృద్ధి సాధిస్తున్నాం

దేశంలోనే రెండో ఆర్థిక రాష్ట్రం

కోయంబత్తూరు సభలో సీఎం స్టాలిన్

రూ.300 కోట్లతో లైబ్రరీ, సైన్స్‌సెంటర్‌కు శంకుస్థాపన

చెన్నై, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తూ రాష్ట్రాన్ని దేశంలోనే ద్వితీయ ఆర్థిక రాష్ట్రంగా తీర్చిదిద్దుతున్నట్లు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రకటించారు. కోవై జిల్లా నార్త్ అనుప్పర్‌పాళయం గ్రామంలో పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో రూ.300 కోట్లతో నిర్మించనున్న పెరియార్ గ్రంథాలయం, వైజ్ఞానిక కేంద్రానికి బుధవారం ఉదయం సీఎం శంకుస్థాపన చేశారు. ఏడంతస్తుల్లో ఈ గ్రంథాలయం, వైజ్ఞానిక కేంద్రాన్ని నిర్మించనున్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో స్టాలిన్ ప్రసంగిస్తూ.. 2021లో తాను ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టినుండి సంక్షేమ పథకాలపైనే ప్రత్యేక దృష్టి సారిస్తున్నానని, వాటి ఫలితాలు మారుమూల గ్రామాల్లో లబ్ధిదారులకు చేరుతున్నాయా లేదా అని పరిశీలించేందుకు జిల్లాలవారీ పరిశీలనకు వచ్చానని, లోక్‌సభ ఎన్నికలు, పెట్టుబడుల సమీకరణ కోసం అమెరికా పర్యటన తదితర కార్యక్రమాల వల్ల తాత్కాలిక విరామం ప్రకటించాల్సి వచ్చిందన్నారు. ఆ తర్వాత తాను క్షేత్ర పరిశీలనకు కోయంబత్తూరు జిల్లా ఎంచుకుని రెండు రోజులుగా అధికారులతో అభివృద్ధి పథకాలపై సమీక్ష జరుపుతున్నానని చెప్పారు. మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి శతజయంతి వేడుకల సందర్భంగా మదురైలో భారీ గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశామని, మదురై గ్రంథాలయాన్ని వీక్షించిన కోవై వాసులు, ఈ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సెంథిల్‌బాలాజీ కూడా తమ జిల్లాలోనూ అలాంటి గ్రంథాలయం ఏర్పాటు చేయాలని తనపై ఒత్తిడి చేశారని, వారి కోరిక మేరకు కొత్త గ్రంథాలయానికి శంకుస్థాపన చేశానని తెలిపారు. చెన్నైలో అన్నాదురై పేరుతో, మదురైలో కరుణానిధి పేరుతో గ్రంథాలయాలు ఉండటంతో కోవైలో ఏర్పాటయ్యే గ్రంథాలయానికి ఆ ఇద్దరు నేతలకు మార్గదర్శకుడిగా వ్యవహరించిన పెరియార్ పేరు పెడుతున్నామని సభికుల హర్షధ్వానాల నడుమ పేర్కొన్నారు. ఈ గ్రంథాలయ శంకుస్థాపన రోజే దాని ప్రారంభోత్సవ తేదీ కూడా ప్రకటించనున్నామని, 2026 జనవరిలో పెరియార్ గ్రంథాలయం ప్రారంభిస్తామని తెలిపారు.

స్వర్ణకారులకు వరాలు..

మంగళవారం రాత్రి తాను కోయంబత్తూరులోని స్వర్ణకారులను కలిసి వారి డిమాండ్లను తెలుసుకున్నానని స్టాలిన్ చెప్పారు. ప్రపంచ స్థాయి నాణ్యతాపరమైన స్వర్ణాభరణాల తయారీ కేంద్రంగా ఉన్న కోయంబత్తూరు కురిచ్చి ప్రాంతంలో ఉన్న పారిశ్రామిక వాడలో రూ.126 కోట్లతో పారిశ్రామిక సముదాయం ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. ఎన్ఏబీఎల్ అనుమతితో పరిశోధన కేంద్రం సహా అన్ని సదుపాయాలతో ఈ కాంప్లెక్స్‌లో రెండు వేల మందికి ప్రత్యక్షంగా, 1500 మందికి పరోక్షంగా ఉపాధి అవకాశాలు కలుగుతాయని చెప్పారు. ఇక లోక్‌సభ ఎన్నికల్లో డీఎంకే చేసిన హామీ మేరకు త్వరలో కోయంబత్తూరులో క్రికెట్ స్టేడియం నిర్మించనున్నామని తెలిపారు.

కొత్త ఐటీ కాంప్లెక్స్..

కోయంబత్తూరు ప్రజలు, విద్యార్థుల కోరిక మేరకు ప్రస్తుతమున్న టైడల్ పార్కు సమీపాన ఎల్కోసిసస్ వద్ద 17.17 ఎకరాల్లో కొత్త ఐటీ కాంప్లెక్స్ ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. ఈ ఐటీ కాంప్లెక్స్ ద్వారా సుమారు 36 వేల మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. కొండాముత్తూరు ప్రాంతంలో జనావాస ప్రాంతాల్లో అడవి ఏనుగులు చొరబడకుండా ఉండేందుకు రూ.7 కోట్లతో 10 కి.మీ.ల వరకు కంచె నిర్మించనున్నట్లు ప్రకటించారు. జిల్లాలోని పలు గ్రామాలకు సమగ్ర మంచినీట పథకం అమలు చేస్తామన్నారు. కోవై కార్పొరేషన్ పరిధిలో రహదారులు, భూగర్భడ్రైనేజీల మరమ్మతులు, కొత్త రహదారుల నిర్మాణం తదితర అభివృద్ధి పనులకు రూ.200 కోట్ల మేర కేటాయిస్తున్నట్లు సభికుల హర్షధ్వానాల మధ్య స్టాలిన్ ప్రకటించారు.

సెమ్మొళి పూంగా పనుల తనిఖీ...

ఈ కార్యక్రమానికి ముందు ముఖ్యమంత్రి స్టాలిన్ కోయంబత్తూరు గాంధీపురం సెంట్రల్ జైలు ప్రాంగణం వద్ద రూ.167.25 కోట్లతో 165 ఎకరాల్లో నిర్మిస్తున్న సెమ్మొళి పార్కు పనులను తనిఖీ చేశారు. కార్యక్రమాల్లో మంత్రులు కేఎన్ నెహ్రూ, ఈవీ వేలు, ఎస్.ముత్తుసామి, ఎంపీ సామినాథన్, వి.సెంథిల్‌బాలాజీ, అన్బిల్ మహేష్, ఎన్.కయల్‌విళి సెల్వరాజ్, ఎంపీలు అందియూరు సెల్వరాజ్, గణపతి పి. రాజ్‌కుమార్, కె.ఈశ్వరసామి, శాసనసభ్యురాలు వానతి శీనివాసన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎన్.మురుగానందం, ప్రజాపనుల శాఖ అదనపు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మంగత్‌రామ్ శర్మ, పాఠశాలల విద్యాశాఖ కార్యదర్శి ఎస్ మధుమతి, పౌర గ్రంథాలయాల సంచాలకులు పి.శంకర్, కోయంబత్తూరు కలెక్టర్ క్రాంతికుమార్ పాడి, కోయంబత్తూరు కార్పొరేషన్ కమిషనర్ శివగురు ప్రభాకరన్ తదితరులు పాల్గొన్నారు.

కోవై ప్రజలను ఆకట్టుకునేందుకు

స్టాలిన్ ప్రయత్నాలు

- బీజేపీ ఎమ్మెల్యే వానతి శీనివాసన్ కితాబు

చెన్నై, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): గత రెండు రోజులుగా తమ జిల్లాలో పర్యటించిన ముఖ్యమంత్రి స్టాలిన్ ఇక్కడి ప్రజలను ఆకర్షించేందుకు పలు పథకాలను ప్రకటించి ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారని కోయబత్తూరు శాసనసభ సభ్యురాలు వానతి శీనివాసన్ కితాబిచ్చారు. కోయంబత్తూరులో పెరియార్ గ్రంథాలయం, వైజ్ఞానిక కేంద్రం శంకుస్థాపన కార్యక్రమంలో స్టాలిన్, మంత్రులతో పాటు నియోజకవర్గం ప్రతినిధి హోదాలో ఆమె కూడా పాల్గొన్నారు. ఆ సందర్భంగా ముఖ్యమంత్రిని కలిసి వినతి పత్రం సమర్పించారు. కోయంబత్తూరులో మెట్రోరైలు ప్రాజెక్టును తర్వగా అమలు చేయాలని, భూగర్భ డ్రైనేజీ మరమ్మతులు చేపట్టాలని, స్మార్ట్‌సిటీగా మార్చాలని ఆ



కోవై సభలో ముఖ్యమంత్రి స్టాలిన్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న వానతి శీనివాసన్

వినతి పత్రంలో ఆమె పేర్కొన్నారు. ఈ విషయమై వానతి శీనివాసన్ మీడియాతో మాట్లాడుతూ... కోయంబత్తూరు జిల్లాకు స్టాలిన్ వరాల జల్లు కురిపించారని, ముఖ్యంగా అవినాశి వద్ద నిర్మిస్తున్న ఫ్లై ఓవను చిన్నంపాళయం నుంచి నీలాంపూరు వరకు కొనసాగించేందుకు అంగీకరించడం. స్వర్ణకారుల కోసం ప్రత్యేక సముదాయం ఏర్పాటు, కోయంబత్తూరు కార్పొరేషన్‌లో అభివృద్ధిపనులకు రూ.200 కోట్ల మేరకు నిధులు ప్రకటించడం హర్షదాయకమన్నారు. రెండురోజులుగా స్టాలిన్ చేస్తున్న ప్రకటనలను పరిశీలిస్తే కోవై జిల్లా వాసులను ఆకర్షించేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్లు అవగతమవుతోందన్నారు. కోవై ప్రజలను ఎంతమేరకు ఆయన ఆకర్శించగలిగారనే విషయం 2026లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో బహిర్గతమవుతుందని చివర్లో నర్మగర్భంగా వ్యాఖ్యానించారు.

నిత్యావసర సరకుల

అక్రమ రవాణా

- 28 వేల క్వింటాళ్ల బియ్యం స్వాధీనం
- ఆహార శాఖ కార్యదర్శి రాధాకృష్ణన్



మహాబలిపురంలో రేషన్ దుకాణాన్ని తనిఖీ చేస్తున్న రాధాకృష్ణన్

పెరంబూర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మహాబలిపురం మున్సిపాలిటీ పరిధిలోని రేషన్ దుకాణాలను ఆహారశాఖ కార్యదర్శి డా.జె.రాధాకృష్ణన్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బియ్యం అక్రమ రవాణాను అరికట్టేలా డీజీపీ సీమా అగర్వాల్ నేతృత్వంలో నలుగురు ఎస్పీల పర్యవేక్షణలో 500 మంది గస్తీ చేపడుతున్నారన్నారు. ఆంధ్ర రాష్ట్ర సరిహద్దులు, తిరువళ్లూర్ జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో బియ్యం అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఏర్పాటుచేశామని తెలిపారు. ఇప్పటివరకు సరుకుల అక్రమ తరలింపునకు సంబంధించి 9,000 కేసులు నమోదుచేసి, 28,802 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. అక్రమ తరలింపునకు సంబంధించి 9,543 మందిని అరెస్ట్ చేసి, వారిలో 72 మంది బెయిలుపై విడుదల కాలేని కేసులు నమోదుచేశామన్నారు. ప్రజలు సహకరిస్తే మాత్రమే ఆహార సరుకుల అక్రమ రవాణా పూర్తిగా అడ్డుకోవచ్చని రాధాకృష్ణన్ తెలిపారు.

మార్చిలోగా డ్రైవర్ రహిత మెట్రో రైళ్లు



చెన్నై, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): నగరంలో రెండో దశ మెట్రోరైలు మార్గాల్లో డ్రైవర్ రహిత మెట్రోరైళ్ల పరుగులు తీయనున్నాయి. రూ.63,246 కోట్లతో మాధవరం - సిప్కాట్, లైట్‌హౌస్ - పూందమల్లి, మాధవరం - చోళింగనల్లూరు తదితర మూడు మార్గాల్లో 118.9 కి.మీ. వరకు రైలు మార్గాల నిర్మాణం, రైల్వేస్టేషన్ల పనులు చురుకుగా సాగుతున్న విషయం తెలిసిందే. 2026లోగా ఈ మూడు మార్గాల్లో మెట్రోరైళ్లను నడిపేందుకు మెట్రోరైల్ అధికారులు నిర్ణయించారు. ముందుగా ఏ మార్గంలో పనులు పూర్తవుతాయో ఆ మార్గంలో మెట్రోరైలు సేవలు ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో ఈ రెండోవిడత మెట్రోరైలు మార్గాల్లో ప్రయోగాత్మకంగా డ్రైవర్ రహిత రైళ్లను నడిపేందుకు కూడా సిద్ధమవుతున్నారు. ఆ మేరకు మొదటి డ్రైవర్ రహిత మెట్రో రైలును అక్టోబర్‌లో పూందమల్లిలో ఉన్న మెట్రోరైలు డిపో నిర్వాహకులకు అప్పగించారు. ఈ రైలు ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీసిటీలో తయారవుతోంది. మరో తొమ్మిది డ్రైవర్ రహిత రైళ్లు వచ్చే యేడాది మార్చిలోగా నగరానికి చేరుకోనున్నాయి. ప్రస్తుతం డ్రైవర్లతో కూడిన నాలుగు బోగీల రైళ్లు నడుపుతున్నారు. రెండో దశ మెట్రోరైలు ప్రాజెక్టులో డ్రైవర్ లేకుండా మూడు బోగీలు కలిగిన రైళ్లను నడుపబోతున్నారు. ప్రయాణికుల అవసరాలను బట్టి ఈ డ్రైవర్ రహిత రైళ్ల బోగీల సంఖ్యలను ఆరుదాకా పెంచే యోచనలు కూడా ఉన్నాయని మెట్రోరైల్వే అధికారులు చెబుతున్నారు. ఈ డ్రైవర్ రహిత మెట్రో రైలు ట్రయల్ రన్ గత వారం రోజులకు పైగా జరుగుతున్నాయి. ఈ నెలాఖరులను ఈ రైళ్ల పనితీరును మెట్రోరైల్వే భద్రతావిభాగం ఉన్నతాధికారులు పరిశీలించనున్నారు.

కస్తూరి అరెస్టుకు

రంగం సిద్ధం!

- బెదిరింపులకు భయపడేది లేదన్న నటి



కస్తూరి

చెన్నై, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): తెలుగువారిని కించపరిచేలా వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన నటి కస్తూరిని అరెస్టు చేసేందుకు పోలీసులు రంగం సిద్ధం చేసుకున్నట్లు తెలిసింది. అదే సమయంలో తనకు బెదిరింపులు వస్తున్నాయని, ఎవరి బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదని ఆమె తాజాగా తన ఎక్స్ పేజీలో ప్రకటించారు. ఎగ్మూరులో ఇటీవల జరిగిన ఓ మహానాడులో నటి కస్తూరి తెలుగువారిని కించపరిచేలా వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. దానిపై రెండు తెలుగు రాష్ట్రాల తెలుగు సంఘాలు, నగరంలోని తెలుగు సంఘాల నేతల తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. చివరకు ఆమె తెలుగువారి గురించి చేసిన విమర్శలకు బేషరతుగా క్షమాపణ చెప్పింది. అదే సమయంలో తెలుగువారిని కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన కస్తూరిపై రాష్ట్రంలోని పలు స్టేషన్లలో కేసులు నమోదవుతున్నాయి. ఆ మేరకు ఎగ్మూరు పోలీసుస్టేషన్‌లో దాఖలైన ఫిర్యాదు పరిశీలించిన పోలీసులు నటి కస్తూరిపై నాలుగు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. త్వరలో ఆమెను విచారించడానికి సమన్లు పంపించాలని ఎగ్మూరు పోలీసులు నిర్ణయించారు. ఈ నేపథ్యంలో నటి కస్తూరి తాజాగా తన ఎక్స్‌పేజీలో ఓ సందేశం పోస్టు చేశారు. తాను ఎలాంటి బెదిరింపులకు, దాడులకు భయపడబోనన్నారు. సోదరభావంతోనే తన పట్టు సడలించుకోవాల్సి వచ్చిందని కస్తూరి పేర్కొన్నారు.

నేటినుంచి చురుగ్గా

రుతుపవనాలు

- దక్షిణాది జిల్లాలకు భారీ వర్షసూచన

చెన్నై, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఈశాన్య రుతుపవనాలు గురువారం నుంచి తీవ్ర రూపం దాల్చనున్నాయని, ఆ కారణంగా దక్షిణాది జిల్లాల్లో మూడు రోజుల పాటు భారీగా వర్షాలు కురిసే అవకాశాలున్నాయని స్థానిక వాతావరణ కేంద్రం అధికారులు ప్రకటించారు. గురువారం చెంగల్పట్టు, విల్లుపురం, కడలూరు, తంజావూరు, తిరువారూరు, నాగపట్టినం, మైలాడుదురై, పుదుకోట, రామనాథపురం జిల్లాల్లో ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయన్నారు. శుక్రవారం తంజావూరు, తిరువారూరు, నాగపట్టినం, మైలాడుదురై, రామనాథపురం, దిండుగల్, తేని, మదురై జిల్లాలో ఉరుములు మెరుపులతో పలు చోట్ల కుండపోత వర్షాలు కురుస్తాయని, చెన్నై, తిరువళ్లూరు, కాంచీపురం జిల్లాల్లో కొన్ని చోట్ల చెదురుమదురుగా వర్షాలు కురిసే అవకాశాలున్నాయని తెలిపారు.

ఎయిర్‌పోర్ట్‌లో నక్షత్ర తాబేళ్ల స్వాధీనం

చెన్నై, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక మీనాంబాక్కం అంతర్జాతీయ విమానాశ్రయంలో థాయ్‌లాండ్‌నుంచి అక్రమంగా తరలించిన 453 నక్షత్ర తాబేళ్లను కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. థాయ్‌లాండ్ నుండి వచ్చిన ప్రయాణికులను కస్టమ్స్ అధికారులు తనిఖీ చేస్తుండగా ఓ ప్రయాణికుడు బరువైన సూట్ కేసు తీసుకెళ్లటం చూసి ఆపి దానిని తెరచి చూశారు. అందులో చిన్న చిన్న ప్లాస్టిక్ పెట్టిల్లో తాబేళ్లు ఉండటంతో వెంటనే స్వాధీనం చేసుకున్నారు. తాబేళ్లను తరలించిన ప్రయాణికుడిని విమానాశ్రయ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నారు. ఆ తాబేళ్లను థాయ్‌లాండ్‌కే తిప్పిపంపేందుకు అధికారులు తగు చర్యలు చేపడుతున్నారు.

ఎన్నికలకు సిద్ధంకండి

డీఎంకే-బీజేపీలే మన ప్రత్యర్థులు ● ఇతర పార్టీలపై విమర్శలొద్దు

- అన్నా డీఎంకే శ్రేణులకు ఎడప్పాడి స్పష్టీకరణ
- ముగిసిన జిల్లా కార్యదర్శుల భేటీ



సమావేశంలో అన్నాడీఎంకే నేతలు

అడయార్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): వచ్చే 2026లో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికలకు సిద్ధం కావాలని అన్నాడీఎంకే శ్రేణులకు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి కె.పళనిస్వామి పిలుపునిచ్చారు. తమ ప్రధాన ప్రత్యర్థులు డీఎంకే, బీజేపీ అని, అందువల్ల ఇతర పార్టీలను విమర్శించవద్దని ఆయన పార్టీ నేతలకు స్పష్టం చేశారు. రాయపేటలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో బుధవారం అన్నాడీఎంకే జిల్లా కార్యదర్శుల సమావేశం జరిగింది. ఈ సమాశంలో పార్టీ ప్రిసీడియం ఛైర్మన్ తమిళ్ మగన్ హుస్సేన్, కోశాధికారి దిండిగల్ శ్రీనివాసన్, జాయింట్ సెక్రటరీలు కేపీ మునుస్వామి, నత్తం విశ్వనాథన్, పార్టీ ప్రధాన కార్యాలయ కార్యదర్శి, మాజీ మంత్రులతో పాటు చెన్నై జిల్లాల కార్యదర్శులు జయకుమార్, బాలగంగా, వెంకటేష్ బాబు, ఆర్ఎస్ రాజేష్, టి.నగర్ సత్య, విరుగై వీఎన్ రవి, ఆదిరాజారాం, కేపీ నందన్, వేళచ్చేరి అశోక్ తదితరులు పాల్గొన్నారు. అలాగే, మొత్తం 82 జిల్లా కార్యదర్శులకుగాను 81 మంది ఈ సమావేశానికి హాజరయ్యారు. ఇందులో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నట్టు తెలుస్తోంది. ప్రధానంగా అన్ని జిల్లాల్లో పార్టీ క్రియాశీలక సభ్యత్వం కలిగిన ప్రతి ఒక్కరికీ ఫొటో గుర్తింపు కార్డుల జారీ ముగియడంతో పార్టీలోని అన్ని విభాగాలకు సంస్థాగత ఎన్నికలు నిర్వహించనున్నట్టు ఎడప్పాడి చెప్పినట్టు సీనియర్ నేత ఒకరు సమావేశం అనంతరం వెల్లడించారు. అలాగే, 2026లో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల కోసం ఇప్పటి నుంచే సమాయాత్తం కావాలని ఆయన పార్టీ నేతలకు పిలుపునిచ్చి, ఆ దిశగా పార్టీ శ్రేణులను సమాయత్తం చేయాలని కోరారని ఆ నేత వెల్లడించారు. వచ్చే ఎన్నికల సమయానికి అన్నాడీఎంకే కూటమిలోకి డీఎంకే కూటమిలోని కొన్ని పార్టీలు చేరనున్నాయని, అందువల్ల ఇతర పార్టీలపై ఎలాంటి విమర్శలు చేయవద్దని కోరినట్టు సమాచారం. ఇదేవిషయంపై ఆ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి డి.జయకుమార్ మీడియాతో మాట్లాడుతూ, డీఎంకే కూటమి పటిష్ఠంగా ఉందంటూ మీడియాలోనే ప్రచారం జరుగుతోందన్నారు. రేపటి రోజు ఎలా ఉంటుందో ఎవరూ ఊహించలేరన్నారు. రాష్ట్రంలో శాసనసభ ఎన్నికలకు మరో 15 నెలల సమయం మాత్రమే ఉండటంతో ఈ ఎన్నికలకు పార్టీ శ్రేణులు సిద్ధంకావాలని ఎడప్పాడి పిలుపునిచ్చారని వెల్లడించారు. అన్నాడీఎంకేపై హీరో విజయ్ ఎలాంటి విమర్శలు చేయకపోవడానికి కారణాలేంటని విలేకరులు ప్రశ్నించగా, తాము అధికారంలో లేకపోవడమేనన్నారు. డీఎంకే ప్రభుత్వ తీరును అన్ని వర్గాల ప్రజలు ఎండగడుతున్నారని జోస్యం చెప్పారు. వచ్చే 2026 ఎన్నికల్లో తమ పార్టీ విజయం సాధించి అధికారంలోకి రావడం తథ్యమని మాజీ మంత్రి జయకుమార్ విశ్వాసాన్ని వ్యక్తం చేశారు.

సమాచార దృష్టి

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు శిక్షణ

పెరంబూర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఈకాట్టుతాంగల్‌లోని తమిళనాడు ఔత్సాహిక పారిశ్రామికవేత్తల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో 'మీరు ఓ పారిశ్రామికవేత్త కావచ్చు' అనే శిక్షణ అందించనుంది. ఈ నెల 11 నుంచి 16వతేదివరకు జరిగే శిక్షణలో... ఎంచుకోవాల్సిన వ్యాపారం, బ్యాంకు, ప్రైవేటు నుంచి రుణాలు పొందడం, ఎగుమతి, దిగుమతులు, జీఎస్‌టీ చట్టాలు సహా పలు విషయాలను నిపుణులు వివరించనున్నారు. 10వ తరగతి ఉత్తీర్ణులై 18 ఏళ్ల నిండిన వారు ఈ శిక్షణలో పాల్గొనవచ్చు. ఆసక్తి కలిగిన వారు www.editn.in అనే వెబ్‌సైట్, 7010143022, 8668102600ఫోన్ నెంబర్లు సంప్రదించవచ్చు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా దిగువ ప్రాంతాల్లో గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

సైదాపేట: దోడ్ హంటర్ నగర్, జోన్స్ రోడ్డు, అన్నాసాలై కొంత భాగం, అబ్దుల్ రజాక్ వీధి, బజార్ రోడ్డు, ఆలందూర్ రోడ్డు, శాస్త్రి నగర్, సీబీటీ నగర్ 1వ మెయిన్ రోడ్డు, ఈస్ట్, వెస్, నార్త్, సౌత్ వీధులు, 70 అడుగుల రోడ్డు, పాత మాంబళం రోడ్డు, కోడంబాక్కం రోడ్డు, కారణీశ్వరర్ ఆలయ వీధి, శేషాచలం వీధి, పోటర్ వీధి, డిడీర్ నగర్, గోడమేడు, సాలవయార్ కాలని, ప్రభుత్వ ఎస్టేట్, జ్యోతియమ్మాళ్ నగర్, సామియార్ గార్డన్, అబిత్ కాలని, నెరుప్పుమేడు, వీఎస్ ముదాలి వీధి, జీనిస్ రోడ్డు, ఫ్లవర్ వీధి, జయరామ్ వీధి, చిన్నమలై ఏరియా కొంత భాగం, బ్రాహ్మణ వీధి, సౌందరేశ్వరాలయ వీధి, భుజంగరావు వీధి, బాలాసింగ్ వీధి, సుబ్రమణియ ఆలయ వీధి, కేపీ ఆలయ వీధి, కారణి గార్డన్, కోడంబాక్కం రోడ్డు, కృష్ణప్పన్ నైకెన్ వీధి, సుబ్రమణియ ముదాలి వీధి, వైశాఖ గార్డన్.

సీఎం ప్రతిభాభివృద్ధి పరీక్షా ఫలితాల విడుదల

పెరంబూర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): సీఎం ప్రతిభాభివృద్ధి పరీక్షా ఫలితాలు వెలువడ్డాయి. ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలల్లో 11వ తరగతి విద్యార్థులు ప్రతిభను గుర్తించేలా ఆగస్టులో సీఎం ప్రతిభాభివృద్ధి పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షల్లో 1,000 మందిని ఎంపిక చేసి, వారికి డిగ్రీ కోర్సు వరకు నెలకు రూ.1000 చొప్పున 10 నెలలుపాటు రూ.10 వేలు అందజేయనున్నారు. ఈ పరీక్షా ఫలితాలు www.dge.tn.gov.in అనే వెబ్‌సైట్‌లో విడుదల చేసినట్లు ప్రభుత్వ పరీక్ష శాఖ డైరెక్టరేట్ తెలియజేసింది.

మూడు మండలాలకు తాగునీటి సరఫరా నిలిపివేత

పెరంబూర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఈసీఆర్‌లోని ఇంజంబాక్కం, వీజీపీ ఎదురుగా చేపట్టిన రోడ్డు విస్తరణ పనుల కోసం తాగునీటి పైపులు మార్చే పనులు జరుగుతున్నాయి. ఈ కారణంగా అడయార్, పెరుంగుడి, షోలింగనల్లూర్ మండలాల్లోని కొన్ని ప్రాంతాల్లో బుధవారం సాయంత్రం నుంచి గురువారం సాయంత్రం వరకు పైపుల ద్వారా తాగునీటి సరఫరా నిలిపివేయనున్నారు. అత్యవసర సేవలకు https://cmwssb.tn.gov.in/ అనే వెబ్‌సైట్, 044-45674567 అనే నెంబర్లు సంప్రదించాలని మెట్రోవాటర్ బోర్డు ప్రకటనలో తెలిపింది.

కో-ఆప్టెక్స్‌లో రూ.61 కోట్ల విక్రయాలు

పెరంబూర్,నవంబరు 6 (ఆంధ్రజ్యోతి):ఈ ఏడాది దీపావళి విక్రయాలు పెంచేలా కో-ఆప్టెక్స్ 30 శాతం రాయితీతో సుమారు 700 రకాల డిజైన్లతో చీరలు పరిచయం చేసింది. ఈ పండుగ సందర్భంగా రూ.61.39 కోట్ల విక్రయాలు జరిగాయి. ఈ విక్రయాలు గత ఏడాది దీపావళితో పోల్చితే రూ.11 కోట్లు అధికం. అలాగే, ఆన్‌లైన్ ద్వారా ఏప్రిల్ నుంచి అక్టోబరు వరకు రూ.1.27 కోట్ల విక్రయాలు జరుగగా, గత ఏడాదితో పోల్చితే రూ.86.75 లక్షలు అధికమని ఆ సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది.

విమానాల రద్దుతో ప్రయాణికుల అవస్థలు

పెరంబూర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక మీనంబాక్కం విమానాశ్రయం నుంచి బయల్దేరాల్సిన నాలుగు విమానాలను ఎయిర్ ఇండియా హఠాత్తుగా రద్దు చేయడంతో ప్రయాణికులుఅవస్థలు పడ్డారు.నగరం నుంచి ఉదయం 6.10 గంటలకు గౌహతి. రాత్రి 10.40 గంటలకు కొల్‌కతా వెళ్లే విమానాలు రద్దయ్యాయి. అలాగే, సాయంత్రం 5.35 గంటలకుబెంగళూరునుంచి చెన్నైరావాల్సిన విమా నం, కొల్‌కత్తా నుంచి రాత్రి 10.05 గంటలకు చెన్నై రావాల్సిన విమానాలు రద్దయ్యాయి. దీంతో, ఈ విమానాల్లో రిజర్వేషన్ చేసుకున్న ప్రయాణకులు ఇబ్బంది పడ్డారు. నిర్వహణ కారణాలతో విమానాలు రద్దు చేస్తున్నట్లు అధికారులు ప్రకటించగా, తగినంత మంది ప్రయాణికులు లేకపోవడంతో విమానాలు రద్దు చేశారని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు.

పెద్ద ఉల్లి కిలో రూ.100

పెరంబూర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోయంబేడు మార్కెట్లో దిగుమతులు తగ్గడంతో ఉల్లి కిలో రూ.100 ధర పలుకుతోంది. ఈ మార్కెట్ కు కర్ణాటక, మహారాష్ట్ర, ఆంధ్ర తదితర రాష్ట్రాల నుంచి ప్రతిరోజు 1,300 టన్నుల పెద్ద ఉల్లి దిగుమతవుతుంటుంది. ఈ నేపథ్యంలో, పలు రాష్ట్రాల్లో వర్షాలు కురుస్తుండడంతో ప్రస్తుతం మార్కెట్‌కు 500 టన్నులు మాత్రమే పెద్ద ఉల్లి దిగుమతవుతోంది. దీంతో, మార్కెట్లో కిలో పెద్ద ఉల్లి రూ.100, చిల్లర విక్రయాల్లో రూ.130 వరకు ధర పలుకుతోందని వ్యాపారులు తెలిపారు.

రవాణా శాఖ ఆర్థికంగా బలపడే అవకాశం లేదు

● మంత్రి శివశంకర్



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి శివశంకర్

పెరంబూర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రవాణా శాఖ ఆర్థికంగా అభివృద్ధి చెందే అవకాశం లేదని, ఇది ప్రజలకు సేవ చేసే రంగం కావడంతో, అందులో ఎలాంటి లాభాపేక్ష లేదని రవాణా శాఖ మంత్రి పి.శివశంకర్ తెలిపారు. అరియలూరు జిల్లా డీఎంకే కార్యకర్తల సమావేశం మంగళవారం రాత్రి జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న మంత్రి శివశంకర్ మీడియాతో మాట్లాడుతూ... ముఖ్యమంత్రి స్టాలిన్ ఈ నెల 15వ తేది అరియలూరు జిల్లా జయంకొండాం సమీపం మహిమైపురం గ్రామంలో సిప్కాట్ పారిశ్రామికవాడకు భూమి పూజ చేయనున్నారన్నారు. అలాగే, అరియలూరు, పెరంబలూరు జిల్లాల ప్రజలకు సంక్షేమ సహాయాలను సీఎం అందించనున్నారని తెలిపారు. దీపావళి పండుగ సందర్భంగా ప్రయాణికులు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టామన్నారు. ఈ ఏడాది పండుగ సందర్భంగా 5.75 లక్షల మంది నగరం నుంచి స్వగ్రామాలకు వెళ్లారన్నారు. గత ఏడాది 1.10 లక్షల మంది ప్రభుత్వ బస్సుల్లో ముందస్తు రిజర్వేషన్ చేసుకోగా, ఈ ఏడాది 1.52 లక్షలకు పెరిగిందన్నారు. లాభాపేక్ష లేని ప్రజలు సేవచేసే రంగంగా రవాణా శాఖ ఉందన్నారు. డీజిల్ ధర భారీగా పెరిగినా బస్సు ఛార్జీలు పెంచలేదన్నారు. ఇతర రాష్ట్రాలతో పోల్చితే రాష్ట్రంలో బస్సు ఛార్జీలు తక్కువగా ఉన్నాయని, అలాగే, మహిళలు, విద్యార్థినీ, విద్యార్థులకు ఉచిత ప్రయాణ వసతి కల్పించామని మంత్రి తెలిపారు.

అవినీతి ఫిర్యాదులుంటే పింఛన్‌కు అనర్హులు

పెరంబూర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): అవినీతి ఆరోపణలపై సహకార సంఘాల నుంచి శాశ్వతంగా తొలగించబడిన వారు కారుణ్య పింఛన్‌కు అనర్హులని సహకార శాఖ తెలిపింది. సహకార శాఖ పరిధిలో ప్రాథమిక వ్యవసాయ రుణ సంఘాలు సహా పలు సంఘాలున్నాయి. వీటిలో పనిచేసి పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు నెలకు రూ.1,000 కారుణ్య పింఛన్ ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో, సహకార సంఘాల రిజిస్ట్రార్ అన్ని మండల అసోసియేట్ రిజిస్ట్రార్లకు పంపిన లేఖలో... అవినీతి ఆరోపణలు, క్రిమినల్ కేసులతో సంఘాల నుంచి శాశ్వతంగా తొలగించిన ఉద్యోగులు కారుణ్య ఫించన్ పొందేందుకు అనర్హులని తెలిపారు.

దేవాదాయ శాఖ తీరుపై ఎంపీ ఖండన

పెరంబూర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): దేవాదాయ శాఖ తీరును మదురై సీపీఎం ఎంపీ వెంకటేశన్ తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు ఆయన తన ఎక్స్ పేజీలో... దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న పాఠశాలల విద్యార్థులను ఆలయాలకు తీసుకెళ్లి పారాయణం చేయమంటున్నారని వార్తలు ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నాయి. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలోని ఆస్పత్రులకు వచ్చే రోగులకు వైద్యం అందిస్తారా? లేక పారాయణం చేయమని చెప్తారా? అంటూ ఎంపీ ప్రశ్నించారు.

చెన్నై-నెల్లూర్ మెము రైళ్ల రద్దు

పెరంబూర్, నవంబరు 6 (ఆంధ్జ్యోతి): చెన్నై సెంట్రల్-గూడూరు సెక్షన్‌లోని తడ-సూళ్లూరుపేట మధ్య రైలుమార్గంలో మరమ్మతుల కారణంగా మూర్‌మార్కెట్ కాంప్లెక్-సూళ్లూరుపేట-నెల్లూరు మార్గంలో పలు మెము, సబర్బన్ రైళ్లు రద్దు చేసినట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది.

● నెం.06741 మూర్ మార్కెట్ నుంచి ఉదయం 5.15 గంటలకు సూళ్లూరుపేటకు బయల్దేరే సబర్బన్ రైలు, నెం.66004 ఆవడి నుంచి ఉదయం 6.40 గంటలకు మూర్‌మార్కెట్ కాంప్లెక్స్‌కు బయల్దేరే సబర్బన్ రైలు, నెం.06745 సూళ్లూరుపేట నుంచి ఉదయం 7.55 గంటలకు నెల్లూరుకు బయల్దేరే మెము, నెం.06746 నెల్లూరు నుంచి ఉదయం 10.20 గంటలకు సూళ్లూరుపేటకు బయల్దేరే మెము, 06742 సూళ్లూరుపేట నుంచి మధ్యాహ్నం 12.35 గంటలకు మూర్‌మార్కెట్ కాంప్లెక్స్ బయల్దేరే మెము రైళ్లు ఈ నెల 7,9,12 తేదీల్లో రద్దు.

పాక్షిక రద్దు...

● మూర్‌మార్కెట్ కాంప్లెక్స్ నుంచి ఉదయం 4.15, 5 గంటలకు సూళ్లూరుపేటకు వెళ్లే రైళ్లు ఈ నెల 7,9,12 తేదీల్లో సూళ్లూరుపేటకు బదులు ఎలావూర్ వరకు మాత్రమే నడవనున్నాయి. మరుమార్గంలో సూళ్లూరుపేట నుంచి మూర్ మార్కెట్ కాంప్లెక్స్‌కు ఉదయం 6.45, సూళ్లూర్‌పేట నుంచి ఉదయం 7.25 గంటలకు చెన్నై బీచ్‌కు బయల్దేరే సబర్బన్ రైళ్లు ఈ నెల 7,9,12 తేదీల్లో సూళ్లూరుపేటకు బదులుగా ఎలావూర్ నుంచి బయల్దేరనున్నాయి.

ఈశాన్యంతో 17 శాతం అధిక వర్షపాతం

పెరంబూర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఈశాన్య రుతుపవనాలతో సాధారణం కన్నా 17 శాతం అధిక వర్షపాతం నమోదైందని ప్రాంతీయ వాతావరణ కేంద్రం తెలియజేసింది. ఈ ఏడాది ఈశాన్య రుతుపవన వర్షాలు అక్టోబరు 15వ తేది నుంచి ప్రారంభం కాగా, గణాంకాల ఆధారంగా అక్టోబరు 1 నుంచే ఈశాన్య రుతుపవన వర్షాలను చేర్చారు. ఆ ప్రకారం, అక్టోబరు 1 నుంచి మంగళవారం వరకు 36 రోజుల్లో సాధారణ వర్షపాతం 21 సెం.మీ కాగా, 17 శాతం అదనంగా 24 సెం.మీ వర్షపాతం నమోదైంది. కాగా, దక్షిణ బంగాళాఖాతంలో మధ్య భాగంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం కారణంగా తమిళనాడు, పుదుచ్చేరి, కారైక్కాల్‌లో ఈ నెల 11వ తేది వరకు మోస్తరు నుంచి భారీవర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం తెలియజేసింది.

13న పాంబన్ వంతెన తుది తనిఖీలు

● 20న ప్రారంభోత్సవానికి అవకాశం?

అడయార్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రామనాథపురం జిల్లాలో కొత్తగా నిర్మించిన పాంబన్ వంతెన తుది దశ తనిఖీలను ఈ నెల 13వ తేదీ చేపట్టే అవకాశం ఉంది. ఈ మేరకు ఇండియన్ రైల్వే సేఫ్టీ కమిషన్‌కు చెందిన నిపుణుల బృందం ఈ వంతెన తనిఖీ చేసి రైళ్ల రాకపోకలకు అనుమతివ్వనుంది. ఆ తర్వాత ఈ నెల 20వ తేదీ ఈ వంతెనను ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించి, జాతికి అంకితం చేయవచ్చని రైల్వే వర్గాలు పేర్కొంటున్నాయి. రామేశ్వరంలో పాంబన్ వంతెనను రూ.550 కోట్లతో 2078 మీటర్ల పొడవులో సముద్ర మట్టానికి 6 మీటర్ల ఎత్తులో అత్యాధునిక పరిజ్ఞానంతో నిర్మించారు. ఈ వంతెన నిర్మాణ పనులు పూర్తి అయినప్పటికీ ఈ వంతెనపై రైళ్ల రాకపోకలకు అనుమతివ్వాలా వద్దా విషయంపై ఇండియన్ రైల్వే సేఫ్టీ కమిషన్ తనిఖీ చేసి నివేదిక సమర్పించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఈ నెల 13, 14వ తేదీల్లో ఈ వంతెన నిర్మాణ తుది విడత తనిఖీలు చేయనున్నారు. ఇదిలావుంటే, ఈ వంతెనకు భారత రత్న, మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం పేరు పెట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ఆ విద్యార్థినిని పరీక్షకు అనుమతించండి

● హైకోర్టు ఉత్తర్వులు

పెరంబూర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): అదనపు విద్యా ఫీజు వసూలుచేస్తున్నారని ఫిర్యాదు చేసిన విద్యార్థినిని పరీక్షలు రాసేందుకు అనుమతించాలని కళాశాల యజమాన్యానికి హైకోర్టు ఆదేశించింది. అదనపు విద్యా ఫీజు పేరుతో రూ.15 కోట్లు విద్యార్థుల నుంచి అడ్డగోలుగా వసూలుచేశారంటూ గురునానక్ కళాశాల విద్యార్థిని లోకేశ్వరి ఫిర్యాదు చేసింది. ఈ కారణంగా లోకేశ్వరి సెమిస్టర్ పరీక్షలు రాసేందుకు కళాశాల యాజమాన్యం అనుమతించలేదు. దీనిని వ్యతిరేకిస్తూ విద్యార్థిని మద్రాసు హైకోర్టులో పిటిషన్ వేసింది. ఈ పిటిషన్ విచారించిన హైకోర్టు, బుధవారం నుంచి 22వ తేది వరకు జరిగే సెమిస్టర్ పరీక్షలకు విద్యార్థినిని అనుమతించాలని గురునానక్ కళాశాల యజమాన్యాన్ని ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీచేసింది.

వెటర్నరీ ఆస్పత్రి తరలింపుపై రైతుల నిరసన



పశువులతో రాస్తారోకోలో రైతులు

పెరంబూర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): తంజావూరు జిల్లా కుంభకోణం సమీపంలో వెటర్నరీ ఆస్పత్రిని తరలించడాన్ని నిరసిస్తూ రైతులు పశువులతో రాస్తారోకో చేపట్టారు. వెప్పత్తూర్‌లో ఉన్న వెటర్నరీ ఆస్పత్రిని తిరువిసైనల్లూర్‌కు తరలించారు. ఆస్పత్రిని మార్చడాన్ని నిరసిస్తూ వెప్పత్తూర్, పరిసర గ్రామాల రైతులు బుధవారం ఉదయం పశువులతో రోడ్డుపై రాస్తారోకోకు దిగారు. సమాచారం అందుకున్న పోలీసులు, రెవన్యూ అధికారులు అక్కడకు చేరుకొని రైతులతో చర్చించి, తాత్కాలికంగా వెప్పత్తూర్‌లో నాలుగు రోజులు, తిరువిసైనల్లూర్‌లో మూడు రోజులు ఆసుపత్రి పనిచేసేలా చర్యలు చేపడతామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించి వెనుదిరిగారు.

రూ.1.5 లక్షలు స్వాహా.. క్యాషియర్ సస్పెన్షన్

వేళచ్చేరి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కన్నియాకుమారి జిల్లా పద్మనాభపురం మున్సిపాలిటీలో మహిళా క్యాషియర్ రూ.1.5 లక్షలు స్వాహా చేసినట్లు ఫిర్యాదులందాయి. ఈ వ్యవహారంపై విచారణకు ఆదేశించిన నేపథ్యంలో, మున్సిపల్ కమిషనర్ మహేశ్వరి బుధవారం మహిళా క్యాషియర్‌ను సస్పెండ్ చేసారు.

డీఎంకేకు గుణపాఠం తప్పదు

● మాజీ మంత్రి డి.జయకుమార్

పెరంబూర్,నవంబరు6(ఆంధ్రజ్యోతి): రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నాడీఎంకే నేత, మాజీ మంత్రి డి.జయకుమార్ తెలిపారు. రాయపేటలోని అన్నాడీఎంకే ప్రధాన కార్యాలయం ఎంజీఆర్ మాలిగైలో బుధవారం ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి నేతృత్వంలో జిల్లా కార్యదర్శులు సమావేశం జరిగింది. జయకుమార్ మాట్లాడుతూ... అన్నాడీఎంకే అమలుచేసిన పథకాలను పేర్లు మార్చి డీఎంకే అమలు చేసిందన్నారు. ఎన్నికల హామీల అమలులో డీఎంకే శ్రద్ధ చూపడం లేదన్నారు. డీఎంకే వైఫల్యాలను ప్రజలకు తెలియజేసేలా ప్రచారాలు చేపట్టాలని సమావేశంలో నిర్ణయించామన్నారు. తమిళ జాతీయవాదం తమిళ ప్రజల గుర్తింపు అని, ద్రావిడం మా ఐడియాలజీ అని అన్నారు. విజయ్ పార్టీ గురించి సమావేశంలో చర్చించలేదని జయకుమార్ తెలిపారు.

వాల్పారై కాలనీలో చిరుతల సంచారం



కో-ఆపరేటివ్ కాలనీలో సంచరిస్తున్న చిరుతపులులు

చెన్నై, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూరు జిల్లా వాల్పారైలోని జనావాస ప్రాంతాల్లో రాత్రిపూట రెండు చిరుతపులులు సంచరించడంతో స్థానికులు భీతిల్లుతున్నారు. మంచుకాలంలో వాల్పారై వద్ద చిరుతపులులు ఎక్కువగా సంచరిస్తుంటాయి. ఈ నేపథ్యంలో మంగళవారం అర్ధరాత్రి వాల్పారై కో-ఆపరేటివ్ కాలే, ఈ తులసింగనగర్, కామరాజర్‌నగర్, అన్నానగర్ ప్రాంతాల్లో రెండు చిరుతపులులు సంచరించాయి. ఆ ప్రాంతాల్లోని సీసీ కెమెరాల్లో ఆ దృశ్యాలు నమోదయ్యాయి. విషయం తెలుసుకున్న స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. వాల్పారై తేయాకు తోటల నుండి వచ్చిన రెండు చిరుతపులు పరస్పరం దెబ్బలాడుకుంటూ ఒకదాని వెనుక నడచి వెళ్తున్న దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డయింది. చిరుతపులుల సంచారం గురించి తెలుసుకున్న స్థానికులు అటవీ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. చిరుతపులను నిర్బంధించి అడవిలోకి తరమాలని విజ్ఞప్తి చేశారు.

జాకీల సాయంతో లేపిన అమ్మవారి ఆలయం



మూడడుగులు ఎత్తు లేపిన ఆలయం

పెరంబూర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పొన్నేరి సమీపం తిరేవేంగిడపురం గ్రామంలో కృష్ణన్ మారియమ్మన్ ఆలయం ఉంది. ఈ ఆలయంలో వినాయకుడు, ఆంజనేయుడు, దుర్గ, షణ్ముగ, కౌమారి, వైష్ణవి, మహేశ్వరి తదితర దేవతామూర్తులకు ప్రత్యేక సన్నిధులు నిర్మించారు. ఈ ఆలయంలో ప్రతి శుక్రవారం జరిగే పూజలకు భక్తులు పెద్దసంఖ్యలో వస్తుంటారు. ఆలయం సమీపంలోని రోడ్డును పునరుద్ధరించే ప్రతిసారి రోడ్డు ఎత్తు పెరుగుతోంది. దీంతో, ఆలయం రోడ్డు కంటే కిందకు వెళ్లింది. ప్రస్తుతం పొన్నేరి పరిసర ప్రాంతాల్లో జాకీలతో సాయంతో 'లిఫ్టింగ్' విధానంలో భవనాల ఎత్తు పెంచే పనులు జరుగుతున్నాయి. ఈ క్రమంలో, ఈ లిఫ్టింగ్ విధానంలో ఆలయం ఎత్తు పెంచాలని నిర్వాహకులు నిర్ణయించారు. ఓ సంస్థ సాయంతో జాకీలు ఏర్పాటుచేసి క్రమక్రమంగా లిఫ్టింట్ చేశారు. 20 రోజుల లిఫ్టింగ్‌లో ఆలయం మూడడుగుల ఎత్తు లేపారు. మరో రెండు నెలలో ఆలయంలో జీర్ణోద్ధరణ చేపట్టి కుంభాభిషేకం నిర్వహిస్తామని ఆలయ నిర్వాహకులు ఆర్‌ఎన్ బాలాజి సర్కార్ తెలిపారు.

మాదకద్రవ్యాల నిర్మూలన ప్రతిజ్ఞ



ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

వేలూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాల అనర్థాలపై విద్యార్థులకు వివరించి, వారిని ఈ వ్యసనానికి దూరంగా ఉంచేలా జిల్లా యంత్రాంగం పలు అవగాహన కార్యక్రమాలు చేపడుతోంది. అందులో భాగంగా కలెక్టర్ కార్యాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ సుబ్బులక్ష్మి మాదకద్రవ్యాల నిర్మూలన ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో భాగంగా మాదకదవ్యాల నిర్మూలనపై పాఠశాల, కళాశాల విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన వారికి కలెక్టర్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా పిల్లల భద్రత అధికారి సజ్జీత్, ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ మురుగన్, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి ఉమ, రోజనా వన సహాయ సంస్థ డైరెక్టర్ ఎడ్విన్, వేదనాయకమ్, పథక ఆర్గనైజర్ పళనియప్పన్, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

తమ్మినేని బాబు సోదరి కన్నుమూత



వెంకటసుబ్బమ్మ (ఫైల్‌ఫొటో)

చెన్నై, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): 'తమిళనాడు తెలుగు సాంస్కృతిక సంఘం' వ్యవస్థాపకులు ఎల్లూరి రమణయ్య చౌదరి సతీమణి వెంకటసుబ్బమ్మ (90) కన్నుమూశారు. పెరియార్‌నగర్ చంద్రశేఖరన్ రోడ్డులో నితన స్వగృహంలో మంగళవారం రాత్రి వెంకటసుబ్బమ్మ తుదిశ్వాస విడిచారు. ఆమె తమిళనాడు తెలుగు సాంస్కృతిక సంఘం ప్రస్తుత అధ్యక్షుడు తమ్మినేని బాబుకు స్వయానా అక్క. వెంకటసుబ్బమ్మ దంపతులకు నలుగురు కుమారులు, ఒక కుమార్తె. అందరూ వివాహం అనంతరం చెన్నైలోనే స్థిరపడడం విశేషం. ఆమె భౌతికకాయానికి కుటుంబీకులు, బంధుమిత్రులు, పురప్రముఖులు నివాళులర్పించారు. జన ని ప్రధాన కార్యదర్శి గుడిమెట్ల చెన్నయ్య, రెప్కో బ్యాంక్ రిటైర్డ్ జనరల్ మేనేజర్ వంజరపు శివయ్య, ప్రముఖ రంగస్థల నటుడు కాకాని వీరయ్య, వెంకటేశ్వర సమాజం నిర్వాహకులు తదితరులు నివాళులర్పించారు. వెంకట సుబ్బమ్మ పార్థివదేహానికి బుధవారం మధ్యాహ్నం తిరువికనగర్‌లోని శ్మశానవాటికలో అంత్యక్రియలు ముగిశాయి.

బ్రాహ్మణులకు భద్రత లేదనటం తప్పే

● కస్తూరి వ్యాఖ్యలకు నటుడు ఎస్వీశేఖర్ ఖండన



చెన్నై, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బ్రాహ్మణులకు భద్రత లేదంటూ నటి కస్తూరి చేసిన వ్యాఖ్యలు తీవ్ర గర్హనీయమని తమిళ రంగస్థల, సినీ నటుడు ఎస్వీ శేఖర్ అన్నారు. నగరంలో బుధవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ బహిరంగ సభల్లో మాట్లాడేటప్పుడు ఆచితూచి మాట్లాడాలని, ఏం మాట్లాడుతున్నామనటం కంటే ఎలాటి పదజాలాన్ని వాడుతున్నామనేదే చాలా ముఖ్యమన్నారు. మైకు పట్టుకుంటే చాలు పూనకం వచ్చినట్లు మాట్లాడకూడదన్నారు. కస్తూరి తెలుగువారి గురించి చేసిన వ్యాఖ్యలు ఆ తర్వాత క్షమాపణలు చెబుతూ రాష్ట్రంలో బ్రాహ్మణులకు భద్రతే లేదని చెప్పటం పెద్ద తప్పిదమేనని ఎస్వీ శేఖర్ అన్నారు.

మద్యం మత్తులో ఘర్షణ... కుమారుడిని హత్య చేసిన తండ్రి

వేళచ్చేరి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ఘర్షణకు దిగిన కుమారుడి హతమార్చిన తండ్రి పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయాడు. సెల్లూర్ పెరియర్ వీధికి చెందిన వాసుదేవన్ కుమారుడు లక్ష్మణన్ మద్యానికి బానిసై ఉద్యోగాలకు వెళ్లడం లేదు. ప్రతిరోజు మద్యం సేవించి ఇంటికొచ్చి కుటుంబసభ్యులతో వాగ్వివాదానికి, ఘర్షణకు దిగేవాడని సమాచారం. మంగళవారం రాత్రి మద్యం మత్తులో వచ్చి ఘర్షణలకు పాల్పడిన లక్ష్మణ్ తలపై తండ్రి వాసుదేవన్ గ్రైండర్ రాయితో బాదడంతో, అతను తీవ్రగాయాలతో ఘటనా స్థలంలోనే మృతిచెందాడు. అనంతరం వాసుదేవన్ సెల్లూరు పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయాడు.

అత్త, ఆడపడుచు హత్యకేసులో నలుగురికి జంట జీవిత ఖైదు

అడయార్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): అత్త, ఆడపడుచు హత్య కేసులో కోడలి సహా నలుగురికి రెండు యావజ్జీవ కారాగారశిక్షలు విధిస్తూ పుదుక్కోట మహిళా కోర్టు మంగళవారం తీర్పునిచ్చింది. జిల్లాలోని పాలయంపట్టి సమీపంలోని వి.లక్ష్మీపురానికి చెందిన అళగి (70), అడక్కమ్మె (47) అనే తల్లీకూతుళ్లు 2014, మే 4న దారుణ హత్యకు గురయ్యారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి, అళగి కోడలు సుబ్బమ్మాళ్ (55), మనవలు వెల్లైస్వామి (34), పాండి (37), వీరి బంధువు బల్లుపాండి (34) అనే వారిని అరెస్టు చేశారు. ఈ కేసు విచారణ పుదుక్కోట మహిళా కోర్టులో జరిగింది. ఈ కేసులోని సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయమూర్తి ఈ నలుగురికి రెండు జీవిత కారాగార శిక్షలతో పాటు రూ.12వేలు అపరాధం విధిస్తూ తీర్పునిచ్చారు.

దీపావళి చిట్టీ పేరుతో రూ.1.20 కోట్ల మోసం

వేలూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): దీపావళి చీటీ పేరుతో రూ.1.20 కోట్ల మోసానికి పాల్పడిన వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఆనైకట్టు ప్రాంతానికి చెందిన రంజన్ అరియూర్‌లో కిరాణా దుకాణం నడుపుతున్నాడు. దీపావళి పండుగ సందర్భంగా గత ఏడాది నవంబరు నుంచి ఈ ఏడాది అక్టోబరు వరకు 12 నెలలు నెలకు రూ.1,000 చొప్పున చీటీ కట్టిన వారికి 2 గ్రాముల బంగారు నాణెం, టపాసుల గిఫ్ట్ బాక్స్, 5 లీటర్ల వంట నూనె, 5 కిలోల కందిపప్పు, బెల్లం, చక్కెర తలా 2 కిలోలు, స్వీట్ కిలో, 5 కిలోల గోధుమ పిండి, మేక, కోడి మాంసం తలా కిలో ఇస్తానని ప్రకటించారు. ఆయన మాటలు నమ్మి సుమారు 3 వేల మందికిపైగా చీటీలో చేరినట్లు సమాచారం. దీపావళి ముగిసినా ప్రకటించిన సరుకులు ఇవ్వకపోవడంతో బాధితులు అతడిని నిలదీశారు. దీంతో, బంగారం, టపాసులు ఇవ్వకుండా మిగిలిన వస్తువులు ఇచ్చిన రంజన్, బంగారం ధర పెరిగినందున అదనంగా రూ.2 వేలు ఇస్తే బంగారం ఇస్తానని వారికి తెలిపారు. ఈ వ్యవహారంలపై పెన్నాత్తూర్ ప్రాంతానికి చెందిన సతీష్‌కుమార్ అరియూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా రంజన్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు, అతను ఓ గిడ్డంగిలో ఉంచిన 98 మేకలు స్వాధీనం చేసుకొని విచారణ జరుపుతున్నారు.

జూదమాడుతున్న ఐదుగురి అరెస్ట్

వేలూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆంబూరు సమీపంలో పేకాడుతున్న ఐదుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. మిట్టాలమ్ వన్నియనాథపురం కానారు ప్రాంతంలో పలువురు జూదమాడుతున్నట్లు ఉమ్‌రాబాద్ పోలీసులకు సమాచారం అందింది. దీంతో, ఆ ప్రాంతంలో తనిఖీలు చేపట్టిన పోలీసులు, జూదమాడుతున్న వన్నియనాథపురం ప్రాంతానికి చెందిన వేలాయుధం, వినోద్, దశరథన్, మురళి, మధు తదితరులను అరెస్ట్ చేసి, రెండు ఆటోలు స్వాధీనం చేసుకున్నారు. అలాగే పరారైన పలువురి కోసం గాలిస్తున్నారు.

నీట్ శిక్షణ పొందుతున్న విద్యార్థిని ఆత్మహత్య

చెన్నై, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): తిరునల్వేలి జిల్లా కల్లకాడు ప్రాంతానికి చెందిన ముత్తులక్ష్మి (17) అనే ప్లస్-2 విద్యార్థిని బుధవారం ఉదయం ఇంటిలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. గత యేడాది ఆమె నీట్ రాసి ఉత్తీర్ణత కాలేకపోయింది. ఈ యేడాది మళ్ళీ నీట్‌లో ఉత్తీర్ణత సాధించాలనే పట్టుదలతో ప్రైవేటుగా శిక్షణ పొందుతోంది. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఆమె ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కల్లకాడు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

15లోపు వృద్ధాశ్రమాలు, వసతి గృహాల నమోదు



తొరప్పాడి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తనిఖీ చేస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

వేలూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రైవేటు సంస్థలు నిర్వహిస్తున్న వృద్ధాశ్రమాలు, పిల్లల హోంలు, మహిళా హాస్టల్స్ తదితరాలను ఈ నెల 15వ తేదిలోపు జిల్లా సాంఘిక సంక్షేమ కార్యాలయంలో నమోదుచేసుకోవాలని జిల్లా కలెక్టర్ సుబ్బులక్ష్మి తెలిపారు. గడువు ముగిసిన తరువాత కూడా నమోదు చేసుకోకుండా పనిచేస్తున్న ఆశ్రమాలు, వసతి గృహాలపై చట్టపరమైన చర్యలు చేపడతామని కలెక్టర్ హెచ్చరించారు. ఈ నేపథ్యంలో, తొరప్పాడి ప్రభుత్వ పాఠశాలను కలెక్టర్ సుబ్బులక్ష్మి బుధవారం ఉదయం పరిశీలించారు.

బ్యాంకు ఉద్యోగినిపై అత్యాచారం

● నిందితుడి కోసం లుకౌట్ నోటీసు

అడయార్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): తిరుచ్చి జిల్లాలోని ఓ ప్రైవేటు బ్యాంకులో పనిచేసే ఉద్యోగిని అత్యాచారానికి గురయ్యారు. అయితే, ఆమెపై లైంగిక దాడికి పాల్పడిన నిందితుడు విదేశాల్లో ఉద్యోగం చేస్తుండటంతో అతడి కోసం పోలీసులు లుకౌట్ నోటీసు జారీ చేశారు. తిరుచ్చికి చెందిన యువతి ఓ ప్రైవేటు బ్యాంకులో పనిచేస్తుండగా, ఈమెకు ఇన్‌స్టాగ్రామ్‌లో కడలూరు జిల్లాకు చెందిన యువకుడు పరిచయమయ్యాడు. కాలక్రమంలో వీరిద్దరి మధ్య ప్రేమ ఏర్పడింది. ఈనేపథ్యంలో గత ఫిబ్రవరి 19వ తేదీ వీరిద్దరు కలిసి హోటల్‌కు వెళ్ళారు. అక్కడ శీతలపానీయంలో మత్తుమందు కలిసిన ప్రియుడు.. ఆ యువతిపై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఆ తర్వాత అతను ఉపాధి కోసం విదేశాలకు వెళ్ళిపోగా, ఆ యువతి పెళ్ళికి సిద్ధమైంది. ఈ విషయం తెలుసుకున్న ప్రియుడు ఆమెకు ఫోన్ చేసి వేధించసాగాడు. ఆమె ఎంతకీ దిగిరాకపోవడంతో యువతి తల్లిదండ్రులకు ఫోన్ చేసి విషయం చెప్పాడు. దీంతో బాధితురాలు జిల్లాలోని తిరువెరుంబూరు ఆల్ ఉమెన్స్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో విదేశాల్లో ఉన్న నిందితుడి కోసం లుకౌట్ నోటీసు జారీ చేశారు.

వ్యాపారవేత్త భార్య వద్ద రూ.10 కోట్ల మోసం

● ఇద్దరి అరెస్టు

అడయార్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ షేర్ మార్కెటింగ్ పేరుతో నగరానికి చెందిన ఓ వ్యాపారవేత్త భార్య వద్ద రూ.10.27 కోట్ల మేరకు మోసం చేసిన ఇద్దరిని నగర పోలీసులు అరెస్టు చేశారు. నగర పోలీస్ కమిషనర్ కార్యాలయంలో కొట్టూర్‌పురంకు చెందిన వ్యాపారవేత్త లిఖితపూర్వక ఫిర్యాదు చేశారు. ఆన్‌లైన్ షేర్ మార్కెటింగ్‌లో పెట్టుబడి పెడితే రెట్టింపు ఆదాయం వస్తుందంటూ ఆన్‌లైన్‌లో చేసిన ప్రచారాన్ని నమ్మిన తన భార్య పెట్టుబడులు పెట్టింది. ఆన్‌లైన్ మోసగాళ్ళు పంపిన వాట్సాప్ లింకుల్లో రూ.10,27,06,364 పెట్టుబడిగా పెట్టారు. ప్రతి దఫాలో పెట్టిన పెట్టుబడికి రెట్టింపు మొత్తంలో ఆదాయం వస్తుందని ఆశ కల్పించారు. ఆ తర్వాత తన భార్య పెట్టుబడిగా పెట్టిన డబ్బు విత్‌డ్రా చేసుకునేందుకు ప్రయత్నించగా, వారు అంగీకరించలేదు కదా... ఇంకా పెట్టుబడులు పెట్టాలని ఒత్తిడి తెచ్చినట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై నగర పోలీస్ కమిషనర్ అరుణ్ ఆదేశం మేరకు.. సైబర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టి ఆన్‌లైన్ షేర్ మార్కెటింగ్ పేరుతో మోసం చేసిన కేకే నగర్‌కు చెందిన శ్రీనివాసన్ (43), పొళిచ్చలూరుకు చెందిన రాజేష్ రామ్ (36)లను అరెస్టు చేశారు.

'రోహిణి' థియేటర్ ఆక్రమణ స్థలం స్వాధీనం

అడయార్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోయంబేడులోని రోహిణి థియేటర్ యాజమాన్యం ఆక్రమించుకున్న స్థలాన్ని నగర కార్పొరేషన్ అధికారులు తిరిగి స్వాధీనం చేసుకున్నారు. కోయంబేడు ప్రాంతానికి చెందిన సంఘ సేవకుడు పాల్‌పాండి 2015లో మద్రాస్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయగా, ఇందులో కోయంబేడులోని రోహిణి థియేటర్ యజమాన్యం ప్రజలు ఉపయోగించే స్థలాన్ని ఆక్రమించుకుందని, దీన్ని తిరిగి స్వాధీనం చేసుకునేలా కార్పొరేషన్ అధికారులను ఆదేశించాలని కోరారు. ఈ పిటిషన్‌పై పలు దఫాలుగా కోర్టులో విచారణ జరగ్గా, ఆక్రమణకు గురైన స్థలాన్ని తిరిగి స్వాధీనం చేసుకోవాలని ఆదేశించింది. దీంతో పోలీసులు భద్రతతో రంగంలోకి దిగిన కార్పొరేషన్ అధికారులు రోహిణి థియేటర్ యాజమాన్యం ఆక్రమించుకున్న స్థలాన్ని తిరిగి స్వాధీనం చేసుకున్నారు. ఈ స్థలం కోసం తొమ్మిదేళ్ళపాటు న్యాయపోరాటం చేసినట్టు పాల్‌పాండి వెల్లడించారు.



18 నుంచి నయనతార వెడ్డింగ్ వీడియో ప్రసారం

స్టార్ హీరోయిన్ నయనతార, సినీ దర్శకుడు విఘ్నేష్ శివన్ దంపతుల వెడ్డింగ్ వీడియో ఈ నెల 18 నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో ప్రసారంకానుంది. 2022 జూన్ నెల 9వ తేదీన వీరిద్దరూ మూడుముళ్ళ బంధంతో ఒక్కటైన విషయం తెల్సిందే. చెన్నై నగర శివారు ప్రాంతమైన మహాబలిపురంలోని ఒక లగ్జరీ హోటల్‌లో అత్యంత కట్టుదిట్టమైన భద్రత నడుమ అంగరంగ వైభవంగా వీరి వివాహం జరిగింది. ఈ పెళ్ళికి హీరోలు రజనీకాంత్, విజయ్ సేతుపతి, శరత్ కుమార్, సూర్య, షారూక్ ఖాన్ వంటి వారు హాజరయ్యారు. ఈ వెడ్డింగ్ ప్రసారం చేసే శాటిలైట్ హక్కులను ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ సొంతం చేసుకుంది. ఇపుడు దీన్ని నయనతార పుట్టిన రోజైన ఈ నెల 18వ తేదీన 'నయనతార : బియాండ్ ది ఫేరీటెయిల్' పేరుతో ప్రసారం చేయనుంది. దీనికి సంబంధించిన ఓ పోస్టరును నెట్‌ఫ్లిక్స్ రిలీజ్ చేసింది. ఇందులో నయనతార - విఘ్నేష్ శివన్ వివాహంతో పాటు నయనతార జీవితానికి సంబంధించిన పలు అంశాలు ఉన్నట్టు సమాచారం.

చిత్రజ్యోతి

గొప్ప అవకాశాన్ని కోల్పోయా



● లోకేష్ కనకరాజ్

కరోనా మహమ్మారి కారణంగా ఇద్దరు అగ్రహీరోలైన రజనీకాంత్, కమల్ హాసన్‌లను ఒకే ఫ్రేములో డైరెక్ట్ చేసే గొప్ప అవకాశాన్ని కోల్పోయినట్టు యంగ్ డైరెక్టర్ లోకేష్ కనకరాజ్ వెల్లడించారు. 'ఖైదీ', 'విక్రమ్', 'లియో' వంటి బంపర్ హిట్ మూవీలకు దర్శకత్వం వహించిన లోకేష్... ఇపుడు సూపర్‌స్టార్ రజనీకాంత్ 'కూలీ' చిత్రాన్ని డైరెక్ట్ చేస్తున్నారు. ఈ ప్రాజెక్టు పూర్తి చేసిన తర్వాత 'ఖైదీ-2'ను ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో తన ఎల్‌సీయు (లోకేష్ సినిమాటిక్ యూనివర్స్) నుంచి వచ్చే ప్రాజెక్టులను ఆయన వివరించారు. 'కరోనా మహమ్మారి రాకుండా వుండివుంటే రజనీకాంత్, కమల్ హాసన్ నటించాల్సిన చిత్రానికి దర్శకత్వం వహించే గొప్ప అవకాశం దక్కివుండేది. కరోనా కారణంగా ఇది చేజారిపోయింది. ఆ తర్వాత కమల్ హాసన్ కోరిక మేరకు 'విక్రమ్' డైరెక్ట్ చేశాను. ఎల్‌సీయూలో ఓ 10 చిత్రాలుంటాయి. 'విక్రమ్' లోని రోలెక్స్ పాత్రను ప్రత్యేక చిత్రంగా రూపొందిస్తాను. విజయ్ రాజకీయాల్లోకి వెళ్ళకపోయి వుంటే 'లియో-2'ను రూపొందించేవాడిని. ఇపుడు 'విక్రమ్-2' చిత్రాన్ని తెరకెక్కించి ఎల్ సీ యూకి ముగింపు పలుకుతాను' అని పేర్కొన్నారు.


శివకార్తికేయన్‌ను అభినందిస్తున్న సెల్వపెరుందగై

'అమరన్'కు పన్ను మినహాయింపు ఇవ్వాలి

● టీఎన్‌సీసీ చీఫ్ ● ప్రతి విద్యార్థికి చూపించాలి

రాజ్‌కుమార్ పెరియస్వామి దర్శకత్వంలో శివకార్తికేయన్ హీరోగా అగ్రనటుడు కమల్ హాసన్ నిర్మించి రిలీజ్ చేసిన 'అమరన్' చిత్రాన్ని ప్రతి ఒక్కరూ వీక్షించేలా ప్రభుత్వం పన్ను మినహాయింపు ఇవ్వాలని టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుందగై కోరారు. ఈ చిత్రాన్ని చూసిన ఆయన చిత్ర బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు. ఆ తర్వాత ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. "అమరన్' చిత్రాన్ని ప్రత్యేకంగా వీక్షించే అరుదైన అవకాశం నాకు లభించింది. ఈ సినిమా చూసిన తర్వాత నాకు ఎనలేని ఆనందం, సంతృప్తి కలిగింది. కశ్మీర్ సరిహద్దుల్లో భారత సైన్యం ఎలా పనిచేస్తుంది, అక్కడ ఎదురయ్యే సమస్యలు, సవాళ్ళు ఉగ్రవాదం వల్ల కశ్మీర్ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురవుతున్నాయి ఇలా అనేక విషయాలను సినిమాలో ఎంతో వాస్తవికంగా చూపించారు. ఇలాంటి సినిమా నిర్మించడం అంత తేలికైన పనికాదు. హీరో శివకార్తికేయన్‌కు ఇది జీవితంలో మరిచిపోలేని పాత్ర. తమిళ చిత్రపరిశ్రమలో చిరకాలం గుర్తుండిపోయే మూవీ. మేజర్ ముకుంద్ భార్య పాత్రలో నటించిన సాయిపల్లవి ప్రేక్షకుల మదిలో చిరస్థాయిగా నిలిపోతారు.ఆమె నటించలేదు.పాత్రలో జీవించారు. నేటి యువతరం ఈ చిత్రాన్ని తప్పక చూడాలి. అలాగే, ఈ సినిమాకు ప్రభుత్వం వినోదపు పన్ను మినహాయించేలా ముఖ్యమంత్రి స్టాలిన్ చర్యలు తీసుకోవాలి. అదేసమయంలో అన్ని పాఠశాలల విద్యార్థులకు విద్యాశాఖ ఈ సినిమా చూపించి, వారిలో దేశభక్తిని పెంపొందించేలా కృషి చేయాలి' అని కోరారు.


'రాకాయి' ఆల్బమ్ సాంగ్‌లో కేపీవై బాలా, నియాతి

కేపీవై బాలా - నియాతి జంటగా

'రాకాయి' ఆల్బమ్ సాంగ్

దేశంలోని ప్రముఖ మీడియా, టాలెంట్ మేనేజ్‌మెంట్ కంపెనీల్లో ఒకటైన నాయిస్ అండ్ గ్రెయిన్స్ తాజాగా మరో ఆల్బమ్ సాంగ్ రూపొందించింది. 'రాకాయి' పేరుతో తెరకెక్కించిన ఈ ఆల్బమ్ సాంగ్‌లో నటుడు కేపీవై బాలా, నటి నియాతి జంటగా నటించారు. ఈ ఆల్బమ్ సాంగ్‌ను నాయిస్ అండ్ గ్రెయిన్స్ అనుబంధ విభాగమైన పింగ్ రికార్డ్స్ ద్వారా అందిస్తుంది. కార్తీక్ శ్రీనివాస్, మహావీర్ అశోక్ సంయుక్తంగా నిర్మించారు. ఈ పాటను కార్తీక్ శ్రీనివాస్, వృషా బాలు కలిసి గానం చేశారు. వర్చ్యువల్ టెక్నాలజీతో సాంగ్ రూపొందించగా, అబు, సల్స్ సంయుక్తంగా డైరెక్ట్ చేశారు. ఈ పాటను ఈ నెల 4వ తేదీన పింక్ రికార్డ్స్ యూట్యూబ్ చానెల్‌లో రిలీజ్ చేయగా, నెటిజన్ల నుంచి మంచి ఆదరణ లభిస్తుంది.

చెరువులో కూడా తామర వికసించదు

● మంత్రి పీకే శేఖర్‌బాబు


పార్క్ పనులు పరిశీలిస్తున్న మంత్రి శేఖర్‌బాబు

పెరంబూర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోరూర్‌లో గ్రీన్ పార్క్ పరిశీలించిన మంత్రి శేఖర్‌బాబు... చెరువులో కూడా తామర పుష్పం వికసిందని చమత్కరించారు. చెన్నై మెట్రో డెవలప్‌మెంట్ అథారిటీ (సీఎండీఏ) ఆధ్వర్యంలో పోరూర్‌లో 16.60 ఎరకాల విస్తీర్ణంలో రూ.12.60 కోట్లతో హరిత ఉద్యానవనం పనులను మంత్రి బుధవారం పరిశీలించారు. ఈ పార్క్‌లో 103 సీట్ల వసతి, వాకింగ్ ట్రాక్, వాలీబాల్ క్రీడా మైదానం, చిల్డ్రన్స్ పార్క్, 6.85 ఎకరాల్లో కొలను, వ్యాయామశాల, వాహనాల పార్కింగ్, మరుగుదొడ్లు, దుకాణాలు, సీసీ కెమెరాలతో ఏర్పాటవుతోంది. ఈ క్రమంలో, పార్క్ నిర్మాణ పనులను హిందూ దేవాదాయ శాఖ మంత్రి, సీఎండీఏ కమిటీ ఛైర్మన్ పీకే శేఖర్‌బాబు పరిశీలించారు. ఇప్పటివరకు జరిగిన పనులు పూర్తయ్యే కాలం తదితరాలను మంత్రి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆ సమయంలో కొలనులో వికసించిన తామర పుష్పాలను తొలగించాలని మంత్రి ఆదేశించారు. అలాగే, చెరువులో కూడా తామర పుష్పాలు వికసించరాదని మంత్రి చమత్కరించారు. మంత్రి వెంట ఎమ్మెల్యే కె.గణపతి సహా అధికారులు ఉన్నారు.

వ్యవసాయ ఉత్పత్తుల విక్రయ కేంద్రంలో

డిప్యూటీ సీఎం ఉదయనిధి ఆకస్మిక తనిఖీ


వ్యవసాయ ఉత్పత్తుల విక్రయ కేంద్రంలో తనిఖీ చేస్తున్న ఉప ముఖ్యమంత్రి

చెన్నై, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): విల్లుపురంలో పర్యటిస్తున్న ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి బుధవారం ఉదయం అక్కడి వ్యవసాయ ఉత్పత్తుల విక్రయ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. డీఎంకే యువజన విభాగం ఆధ్వర్యంలో ప్రతి నియోజకవర్గంలో కలైంజర్ గ్రంథాలయాలు ఏర్పాటు చేస్తున్నారు. ఆ మేరకు విల్లుపురం సౌత్ జిల్లా డీఎంకే యువజన శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొత్త గ్రంథాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఆ తర్వాత అక్కడికి చేరువగా ఉన్న వ్యవసాయ ఉత్పత్తుల విక్రయ కేంద్రానికి వెళ్ళి తనిఖీ చేశారు. 2వేల మెట్రిక్ టన్నుల వ్యవసాయ ఉత్పత్తులను నిల్వ చేసేందుకు వీలున్న ఆ కేంద్రంలోని ధాన్యం, రాగులు, సజ్జలు, పప్పు దినుసుల స్టాకు వివరాలను పరిశీలించారు. ఆ తర్వాత అక్కడ రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఉదయనిధితోపాటు అటవీశాఖ మంత్రి సి.పొన్ముడి, శాసనసభ్యులు డాక్టర్ ఇరా లక్ష్మణన్, అన్నియూరు ఎ.శివా, ప్రత్యేక పథకాల అమలు శాఖ కార్యదర్శి డాక్టర్ ఫరోస్ అహ్మద్, జిల్లా కలెక్టర్ సి.పళనితదితర అధికారులు కూడా పర్యటించారు.

27 సెకన్లలో 52 భరతనాట్య ముద్రలు

● అమెరికా బాలిక ప్రపంచ రికార్డు


వృక్షా బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సర్టిఫికెట్లతో బాలిక సనా

చెన్నై, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): తేని జిల్లా బోడినాయకనూర్‌లో రెండేళ్లుగా భరతనాట్యంలో శిక్షణ పొందుతున్న అమెరికా బాలిక సనా (11) భరతనాట్య ముద్రల ప్రదర్శనలో ప్రపంచ రికార్డు నెలకొల్పింది. అమెరికా లాస్‌ఏంజెల్స్ ప్రాంతానికి చెందిన షణ్ముగమణి, నళిని దంపతుల కుమార్తె సనా (11) అమెరికాలో జన్మించింది. కొన్నేళ్ల క్రితం ఆ బాలికకు భరతనాట్యం నేర్చుకోవాలనే కోరిక పుట్టింది. దీంతో ఆ బాలికను ఆమె తల్లిదండ్రులు తమ జన్మస్థలమైన బోడినాయకనూర్ పంపంపించారు. బోడినాయకనూర్‌లో సనా రెండేళ్ల పాటు భరతనాట్య శిక్షణ నేర్చుకుంది. ఈ నేపథ్యంలో మంగళవారం బోడినాయకనూరులో జరిగిన కార్యక్రమంలో సనా 27 సెకన్లలో 52 భరతనాట్య ముద్రలు ప్రదర్శించి వృక్షా వరల్డ్ రికార్డ్ ఆఫ్ బుక్‌లో చోటు సంపాదించుకుంది. బోడినాయకనూరు మాజీ ఎమ్మెల్యే లక్ష్మణన్ ముఖ్య అతిథిగా పాల్గొని బాలిక సనాకు సర్టిఫికెట్లు, ప్రశంసాపత్రాలు పంపిణీ చేశారు. సనా రెండేళ్లపాటు బోడినాయకనూరులో భరతనాట్య శిక్షణ పొందుతూనే అక్కడి స్కూలులో ఐదో తరగతి వరకూ తన చదువు కొనసాగించింది. మరికొంతకాలంపాటు భరతనాట్య శిక్షణ పొందిన మీదట ఆ బాలిక అమెరికాకు వెళ్తుంది.

విద్యతో పాటు క్రీడలకు ప్రాధాన్యం


విజేతలతో వర్సిటీ ఛాన్సలర్ విశ్వనాథన్ తదితరులు

● వీఐటీ ఛాన్సలర్ విశ్వనాథన్ సూచన

వేలూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): విద్యతో పాటు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలని వీఐటీ యూనివర్సిటీ ఛాన్సలర్ విశ్వనాథన్ విద్యార్థులకు సూచించారు. స్థానిక వీఐటీ వర్సిటీలో నిర్వహించిన రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో మహిళల విభాగంలో సేలం జట్టు, పురుషుల విభాగం చెన్నై జట్టు విజేతలుగా నిలిచాయి. వర్సిటీ ప్రాంగణంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఛాన్సలర్ విశ్వనాథన్ పాల్గొని విజేతలకు ట్రోఫీలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తనకు వాలీబాల్ అంటే ఎంతో ఇష్టమని, విద్యార్థి దశలో తాను వాలీబాల్ ఆడేవాడినన్నారు. గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన తర్వాత కూడా విద్యార్థులు తాము ఎంచుకున్న క్రీడారంగంలో కొనసాగించాలని సూచించారు. కార్యక్రమంలో వర్సిటీ ఉపాధ్యక్షుడు శంకర్ విశ్వనాథన్, జిల్లా వాలీబాల్ సంఘం అధ్యక్షులు డా.ఎన్వీ త్యాగచందన్, ఉపాధ్యాక్షుడు వి.వినోద్‌కుమార్, కార్యదర్శి కేటీ లక్ష్మణన్, కోశాధికారి టి.దినకరన్ తదితరులు పాల్గొన్నారు.

డీఆర్‌ఏ హోమ్స్‌కు మౌలిక వసతుల నిర్వహణ కాంట్రాక్టు


ప్రాజెక్టు ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్

అడయార్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు ప్రభుత్వానికి చెందిన 'ముదల్వర్ పడైప్పగం' ప్రాజెక్టులో మౌలిక సదుపాయాల నిర్వహణ ఒప్పందాన్ని డీఆర్‌ఏ హోమ్స్ దక్కించుకుంది. ముఖ్యమంత్రి స్టాలిన్ తన సొంత నియోజకవర్గమైన కొళత్తూరులో అనేక అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ముఖ్యంగా యువకులు, మహిళల సంక్షేమం కోసం రూపొందించిన 'ముదల్వర్ పడైప్పగం' కూడా వీటిలో ఉంది. ఇందులో వివిధ రకాలైన మౌలిక సదుపాయాల నిర్వహణ కాంట్రాక్టును డీఆర్‌ఏ హోమ్స్‌కు ప్రభుత్వం అప్పగించింది. ఈ విషయాన్ని డీఆర్‌ఏ హోమ్స్ మేనేజింగ్ డైరెక్టర్ రంజీత్ రాథోడ్ వెల్లడించారు. ఈ సందర్భంగా జరిగిన ఓ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి పీకే శేఖర్ బాబు, నగర మేయర్ ఆర్.ప్రియ, హౌసింగ్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ విభాగం కార్యదర్శి కాకర్ల ఉష, పలువురు ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. మహిళలు, యువకులు సాధికారత చేకూర్చేందుకు రూపొందించిన ముదల్వర్ పడైప్పగం ప్రాజెక్టు కాంట్రాక్టును దక్కించుకోవడం గౌరవంగా, ఆనందంగా ఉందన్నారు.


కోయంబత్తూరు ప్రభుత్వ అతిథిగృహంలో కోవై జిల్లాలో దివ్యాంగులకు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను అమలుపరచిన దివ్యాంగుల సంక్షేమ శాఖ అధికారి ఎస్.చంద్రమోహన్, ఆ శాఖ సిబ్బందిని అభినందిస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

జనవరిలో డీఎంకే సర్వసభ్య సమావేశం

చెన్నై, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర శాసనసభ ఎన్నికలకు సన్నద్ధమయ్యేందుకు వచ్చే యేడాది జనవరిలో డీఎంకే సర్వసభ్య మండలి సమావేశం జరుగనుంది. ఈ సమావేశాన్ని తిరుచ్చి లేదా మదురైలో జరపాలని పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ నిర్ణయించారు. ఇప్పటికే శాసనసభ ఎన్నికల్లో డీఎంకే కూటమి 200 నియోజకవర్గాల్లో గెలిచి తీరాలని, పార్టీ శ్రేణులంతా ఆదిశగా గ్రామీణ స్థాయి నుంచి ప్రభుత్వ పథకాలపై విస్తృత ప్రచారం చేయాలని ఆయన పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. శాసనసభ ఎన్నికలకు ఇంకా 15 నెలలే ఉండటంతో ఆ లోగా పార్టీకి కొత్త జవసత్వాలు కల్పించేలా జనవరిలో సర్వసభ్య మండలి సమావేశాన్ని జరపాలని నిర్ణయించారు. సర్వసభ్యమండలిలో 3500 మందికిపైగా సభ్యులుండటంతో తేనాంపేటలోని అన్నాఅరివాలయం, కలైంజర్ హాలులో ఆ సమావేశం నిర్వహించడం కష్టసాధ్యమని భావిస్తున్నారు. ఈ కారణంగా మదురై లేదా తిరుచ్చిలో ఈ సమావేశాన్ని భారీ యెత్తున నిర్వహించాలని డీఎంకే నేతలు నిర్ణయించారు. ఇంతకు ముందు డీఎంకే 15వ సర్వసభ్య మండలి సమావేశం 2022 అక్టోబరు 9న చెన్నై పచ్చయప్పా కళాశాల ఎదురుగా ఉన్న సెయింట్ జార్జి స్కూలు మైదానంలో నిర్వహించారు. ఆ సర్వసభ్యమండలి సమావేశంలోనే స్టాలిన్ పార్టీ అధ్యక్షుడిగా రెండోమారు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇదివరలో పొంగళూరు పళనిస్వామి పర్యవేక్షణలో కోయంబత్తూరులో డీఎంకే సర్వసభ్య సమావేశం జరిగింది. ఆ రీతిలోనే ఈ సారి మదురై లేదా తిరుచ్చి నగరంలో సర్వసభ్యమండలి సమావేశం జరపాలని పార్టీ నేతలంతా భావిస్తున్నారు.


కార్యక్రమంలో నిర్వాహకులు

ఎఫ్‌ఎల్‌వో చెన్నై 'జమకాలం రీవోవెన్'

అడయార్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎఫ్‌ఎల్‌వో చెన్నై హ్యాండ్ లూమ్స్ సరికొత్తగా 'జవకాలం రీవోవెన్' ఆవిష్కరించింది. ప్రఖ్యాత ఏస్ ఫ్యాషన్ డిజైనర్ తరుణ్ తహిలియాని సారథ్యంలో ఈ మరుపురాని కార్యక్రమాన్ని నిర్వహించింది. 'తోడా థ్రెడ్స్ - ఉమెన్స్ ఆఫ్ ది నీల్‌గిరీస్' పేరుతో నిర్వహించిన సంప్రదాయ తోడా ఎంబ్రాయిడరీ, నీలగిరి గిరిజన మహిళా కళాకారులు పాల్గొన్నారు. ఇందులో రాష్ట్రానికి చెందిన భవానీ చేసిన హ్యాండ్ వోవెన్, జమకాలం రగ్‌లను పరిచయం చేసి, పోత్సహించడం లక్ష్యంగా పెట్టుకున్నారు. ఎఫ్‌ఎల్‌వో చెన్నై చైర్‌పర్సన్ డాక్టర్ దివ్య అభిషేక్ సారథ్యంలో తోడా, జమకాలం ప్రాజెక్టులను ప్రారంభించి, పోత్సహిస్తున్నారు. ఇందులో వర్షా రోహేజా, నబీలా అవియాస్ తమ వంతు సహాయ సహకారాలను అందించారు. అలాగే, చేతితో తయారు చేసిన వస్త్రాలు, చేతి పనుల గొప్పతనాన్ని, వారసత్వాన్ని ప్రోత్సహించేలా ఈ ఎఫ్‌ఎల్‌వో చెన్నై కృషి చేస్తుంది.

కృత్రిమ మేధో పరిజ్ఞానంపై

అప్రమత్తంగా వ్యవహరించాలి

● సిడ్నీ సదస్సులో స్పీకర్ అప్పావు


సిడ్నీ సదస్సులో ప్రసంగిస్తున్న స్పీకర్ అప్పావు

చెన్నై, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): వైజ్ఞానిక రంగంలో సాంకేతిక పరంగా విప్లవాత్మక మార్పులు చోటుచేసుకుంటున్నాయని, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (కృత్రిమ మేధోపరిజ్ఞానం) భవిష్యత్‌లో కీలక పాత్ర పోషించనుందని శాసనసభ స్పీకర్ అప్పావు అన్నారు. ఆస్ట్రేలియాలోని సిడ్నీ నగరంలో బుధవారం ప్రారంభమైన 67వ కామన్‌వెల్త్ పార్లమెంటరీ మహానాడులో ఆయన ప్రసంగించారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా నిజాన్ని పోలిన తప్పుడు వార్తలు, తప్పుడు దృశ్యాలు సామాజిక ప్రసారమాధ్యమాల్లో వెలువడి ప్రజలను, పాలకులను తప్పుదారి పట్టిస్తాయన్నారు. ఈ కృత్రిమ పరిజ్ఞానం నిజాన్ని నిర్భయంగా ప్రకటించేలా ఉంటే లోక సంక్షేమం కలుగుతుందన్నారు. ఈ సదస్సులో వివిధ దేశాలకు చెందిన స్పీకర్లు, ప్రభుత్వ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సదస్సు ఈ నెల 8 వరకు కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు.

హైకోర్టులో ఇద్దరు అదనపు ఏజీలు


అడిషనల్ అడ్వకేట్ జనరల్‌గా నియమితులైన కె.చంద్రమోహన్, ఎం.సురేష్‌కుమార్

చెన్నై, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మద్రాసు హైకోర్టులో కొత్తగా ఇద్దరిని అడిషనల్ అడ్వకేట్ జనరళ్లుగా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మద్రాసు హైకోర్టు, మదురై హైకోర్టు డివిజన్ బెంచ్‌లో ప్రభుత్వం తరపు కేసులు వాదించడానికి ఇప్పటికే అడ్వకేట్ జనరల్, అడిషనల్ అడ్వకేట్ జనరల్, ప్రభుత్వ ప్లీడర్లు, ప్రత్యేక న్యాయవాదులున్నారు. ఈ నేపథ్యంలో అదనంగా ఇద్దరిని అడ్వకేట్ జనరళ్లుగా ప్రభుత్వం నియమించింది. ఆ మేరకు తమిళనాడు, పుదుచ్చేరి బార్ కౌన్సిల్ సీనియర్ సభ్యుడు టీఎన్‌సీసీ న్యాయవిభాగం అధ్యక్షుడు కె.చంద్రమోహన్, సీనియర్ న్యాయవాది ఎం.సురేష్‌కుమార్ అడిషనల్ అడ్వకేట్ జనరళ్లుగా నియమితులయ్యారు. సురేష్‌కుమార్ 1994లో బార్ అసోసియేషన్ సభ్యత్వం పొందారు. మద్రాసు హైకోర్టు, హైకోర్టు మదురై డివిజన్ బెంచ్, ట్రిబ్యునళ్లలో న్యాయవాదిగా సేవలందించారు. రాష్ట్ర విద్యుత్ బోర్డు, దక్షిణ రైల్వే, మనోన్మణీయం విశ్వవిద్యాలయం తదితర సంస్థలకు సంబంధించిన కేసులలో తన వాదనా పటిమను ప్రదర్శించి పలువురి ప్రశంసలందుకున్నారు.

టీటీడీ సభ్యుల ప్రమాణ స్వీకారం

తిరుమల శ్రీవారి ఆలయంలో బుధవారం టీటీడీ ఛైర్మన్‌తో పాటు మరో 15 మంది సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ప్రమాణం చేసిన సభ్యులు..


బి.మహేంద్రరెడ్డి


అనుగోలు రంగశ్రీ


తమ్మిశెట్టి జానకీదేవి


వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి


అదిత్ దేశాయ్


బి.ఆనంద్‌సాయి


జంగా కృష్ణమూర్తి


జాస్తి పూర్ణసాంబశివరావు


ఎం.శాంతారాం


మల్లెల రాజశేఖర్‌గౌడ్


ఎంఎస్ రాజు


నన్నూరి నర్సిరెడ్డి


ఆర్ఎన్ దర్శన్


నరేష్‌కుమార్


పి.రామమూర్తి


ఎస్వీయూ గ్రీన్‌టీం



● పద్మావతి, ఎస్వీయూలో సేంద్రియ వ్యవసాయం చేస్తున్న పీజీ విద్యార్థులు

విద్యార్థుల సేద్యం


పద్మావతి వర్శిటీ గ్రీన్‌టీం

పుస్తకం పట్టిన చేతులే పారా పలుగూ అందుకుంటున్నాయి. ల్యాబరేటరీల్లో పరిశోధనలు చేసే విద్యార్థులు, మట్టిలో విత్తనాలు నాటి, కలుపు తీసి, కూరగాయలు పండించి వినూత్న ప్రయోగాలు చేస్తున్నారు. తిరుపతిలోని పద్మావతి మహిళా యూనివర్శిటీ, శ్రీవేంకటేశ్వర యూనివర్శిటీల విద్యార్థులు సేంద్రియ వ్యవసాయానికి శ్రీకారం చుట్టారు. యూనివర్శిటీల ప్రాంగణంలోనే పాలేకర్ స్ఫూర్తిగా కూరగాయలు సాగు చేస్తున్నారు. వర్ద్ సంస్థ వ్యవస్థాపకుడు గంగాధరం నేతృత్వంలో విద్యార్థులు గ్రీన్‌టీం లుగా ఏర్పడి ప్రకృతి వ్యవసాయ క్షేత్రాల్లో పనుల్లో సందడి చేస్తున్నారు.

ప్రత్యేక కథనం - తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆంధ్రజ్యోతి

20 అడుగుల నేల వారి ప్రయోగ క్షేత్రం

ప్రకృతి వ్యవసాయ ప్రయోగశాలకు ఈ రెండు యూనివర్శిటీల విద్యార్థులు కేటాయించుకున్న నేల.. కేవలం 20 చదరపు అడుగులు మాత్రమే. ఒక కుటుంబం ఏడాది పొడవునా ఆరోగ్యకరమైన కూరగాయలు పండించుకోవడానికి ఈ తావు చాలు అంటారు గంగాధరం. పద్మావతిలో 20 మంది విద్యార్థినులు, ఎస్వీయూలో 20 మంది రెండు గ్రీన్ టీంలుగా ఏర్పడ్డారు. తమ ప్రాంగణాల్లో ప్రయోగ క్షేత్రాన్ని సిద్ధం చేసుకున్నారు. మడులుగా మలచుకుని విత్తనాలు నాటారు. ఇప్పుడవి కాపుకొచ్చాయి. తమ చేతులతో నాటి నీళ్లు పోసి పెంచిన మొక్కలు కాసిన నవనవలాడే కూరగాయలను చూసి వారు మురిసిపోతున్నారు.

సొంతంగా ఎరువులు


విద్యార్థులకు మొక్కల పోషణ గురించి వివరిస్తున్న గంగాధరం

పూర్తిగా సేంద్రియ పద్ధతిలో చేస్తున్న సేద్యం ఇది. దేశీయ విత్తనాలే నాటుతున్నారు. వంగ, బెండ, సొర, బీర, మిరప, టమోటా,మొక్క జొన్న, బీన్స్ వంటి కాయగూరలు ఈ క్షేత్రాల్లో ఉన్నాయి. తోటకూర, సిరికూర, పాలకూర, చుక్కకూర, గోంగూర వంటి ఆకుకూరలున్నాయి. సస్యరక్షణలో భాగంగా బంతి పూల మొక్కలు నాటారు.అంతర పంటగా మొక్కజొన్న నాటారు. చిక్కుడు, సొర, బీర వంటి తీగజాతి మొక్కలు ఒక పక్కగా నాటారు. రసాయన ఎరువులు వాడడం లేదు. జీవామృతం, వేప కషాయం, ఆవు పేడ, మూత్రం, శనగ పిండి, పుట్టమట్టితో తామే ఎరువులు తయారు చేసుకుని ఈ పంటలకు అందిస్తున్నారు.

ఈ అనుభూతి అద్భుతం

రసాయనాల అవశేషాలు లేని ఆహారం తింటే ఆరోగ్యంగా ఉంటాం. సేంద్రియ పద్ధతిలో మేం పండిస్తున్న కూరగాయలు, ఆకుకూరలు ఆరోగ్యకరమైనవి. సహజ ఎరువులే వాడుతున్నాం. మా యూనివర్శిటీలో మా చేతులతో కూరగాయలు పండిస్తున్న అనుభూతి అద్భుతంగా ఉంది.

- డి. ప్రియాంక,
ఎమ్మెస్సీ జువాలజీ సెకండియర్, పద్మావతి వర్సిటీ

ప్రకృతి సేద్యంపై పరిశోధన

పీజీ తర్వాత సహజ సిద్ధంగా లభించే ఆహార పదార్థాల్లోని పోషక విలువలపై పరిశోధన చేయాలనే ఆలోచనతో ఉన్నా. మా యూనివర్శిటీలోని ఈ ప్రయోగ క్షేత్రంలో పనిచేయడం ప్రాథమిక పరిశోధనలా ఉంది. చాలా సంతోషంగా ఉంది.

-ఎం. పల్లవి, ఎమ్మెస్సీ హోం సైన్స్
ఫుడ్ టెక్నాలజీ సెకండియర్, పద్మావతి వర్సిటీ

చీడపీడలపై యుద్ధం

వ్యవసాయంలో చీడపీడలను ఎదుర్కోవడం పెద్ద సవాలు. రసాయన మందులు చల్లి సులువుగా వీటిని నివారిస్తున్నారు. అయితే వీటి అవశేషాలు మిగిలిపోయి మనం ఆహారంగా తీసుకున్నపుడు అనేక రోగాలకు కారణంగా మారుతున్నాయి. ఇందుకు విరుగుడుగా ఈ రెండు యూనివర్శిటీల్లో సేంద్రియ పద్ధతిలోనే చీడపీడలపై యుద్ధం చేస్తున్నారు. ముందుగా బీజామృతంతో విత్తనశుద్ధి చేసుకుని నేలలో నాటుతారు. ప్రతి 15 రోజులకోసారి జీవామృతం నీటిలో కలిపి మొక్కలకు పారిస్తారు. ఇది మంచి పోషకాలను ఇస్తుంది. మట్టిలో ఘనజీవామృతం చల్లడం ద్వారా వానపాములు, జీవరాశులు వ్యాప్తి చెంది పంట భూమి సారవంతమవుతుంది. చీడపీడలు ఆశించకుండా వేపాకు, గోమూత్రం, ఆవుపేడతో చేసిన నీమాస్త్రం పిచికారీ చేస్తున్నారు. పురుగు ఆశిస్తే.. వేప, ఉమ్మెత్త, సీతాఫలం, పల్లేరు ఆకుల జిగురును ఆవు మూత్రంలో ఉడికించి తయారుచేసుకున్న బ్రహ్మాస్త్రం పిచికారీ చేస్తారు. ఎంతకీ లొంగని చీడను అగ్నాస్త్రంతో ఎదుర్కొంటున్నారు. మిరపకాయలు, వెల్లుల్లి, పొగాకు, ఆవుమూత్రంతో దీనిని తయారు చేసుకుంటున్నారు. ఆకుముడత పురుగు, కాండం తొలుచు పురుగు, కాయ తొలుచు పురుగు, వేరు పురుగు నివారణకు దీనిని వాడుతున్నారు.

ఒత్తిళ్లన్నీ మరచిపోతున్నాం

మేం చదువుకునే చోటే ఆకుకూరలు, కూరగాయలు, పూలు పండిస్తున్నాం. చదువుకుంటూనే, స్నేహితులతో కలిసి యూనివర్సిటీలోనే వ్యవసాయ పనులు చేస్తూ ఉండటం చెప్పలేని ఆనందాన్ని ఇస్తూ ఉంది. చదువుల్లో ఉన్న ఒత్తిడినంతా పచ్చని ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని చూసిన వెంటనే మాయమై పోతూ ఉంది.

- ఖలీద్,
ఎమ్మెల్సీ బోటనీ సెకండియర్, ఎస్వీయూ

మా పల్లె రైతులనూ మారుస్తా

క్లాసుల్లేని సమయంలో ఇలా సేద్యం పనులు చేయడం చాలా బావుంది. ప్రతి శుక్ర, శని వారాల్లో గ్రీన్ టీం ఆధ్వర్యంలో కలుపు తీయడం, నీళ్ళు కట్టడం చేస్తున్నాం. ఈ అనుభవంతో మా ఊరిలోనూ రైతులను ప్రకృతి వ్యవసాయం వైపు నడిపించాలని అనిపిస్తుంది.

- రూపేష్ కుమార్,
ఎమ్మెస్సీ బోటనీ సెకండియర్, ఎస్వీయూ




అఖిలాండం వద్ద కర్పూరం వెలిగిస్తున్న సాయిధరమ్ తేజ్ - క్యూలో సప్తగిరి - ఆలయం ముందు స్నేహారెడ్డి

శ్రీవారి సేవలో సినీ ప్రముఖులు

తిరుమల, నవంబరు6(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని బుధవారం పలువురు సినీ ప్రముఖులు దర్శించుకున్నారు. సుప్రభాతసేవలో హీరో సాయిధరమ్ తేజ్, అల్లు అర్జున్ సతీమణి స్నేహారెడ్డి పాల్గొన్నారు. సుప్రభాత పఠనం అనంతరం శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో నటులు సప్తగిరి, రఘు, దగ్గుబాటి అభిరామ్, దర్శకుడు అట్లూరి వెంకటేశ్వరరావు, నిర్మాత సంతోష్ కూడా స్వామిని దర్శించుకున్నారు. ఈమేరకు వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.

ఇద్దరు డిగ్రీ విద్యార్థులపై హత్యాయత్నం

● ఒకరి పరిస్థితి విషమం


చికిత్స పొందుతున్న విష్ణువర్ధన్

శ్రీకాళహస్తి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు డిగ్రీ విద్యార్థులపై గుర్తు తెలియని వ్యక్తి హత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈ ఘటన శ్రీకాళహస్తి పట్టణ శివార్లలోని చెన్నై రోడ్డు సమీపంలో ఉన్న ఈదులగుంట వద్ద కలకలం రేపింది. బుచ్చినాయుడుకండ్రిగ మండలం నెలవాయి గ్రామానికి చెందిన విష్ణువర్ధన్, శ్రీకాళహస్తి పట్టణం తెట్టు ప్రాంతానికి చెందిన వాసు ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్నారు. ఇద్దరూ సాయంత్రం చెన్నై రోడ్డులోని సాయిబాబా ఆలయం సమీపంలో నిలబడి ఉండగా గుర్తు తెలియని వ్యక్తి కత్తితో వారిపై విరుచుకుపడ్డాడు. దీంతో విష్ణువర్ధన్ తీవ్రంగా, వాసు స్వల్పంగా గాయపడ్డారు. అటుగా వెళుతున్న కొందరు గమనించి యువకులను ఆటోలో శ్రీకాళహసి పట్టణంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ విష్ణువర్ధన్‌కు ప్రాథమిక చికిత్స చేశారు. అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు రెఫర్ చేశారు. స్వల్ప గాయాలతో బయటపడ్డ వాసు స్థానిక ప్రైవేటు వైద్యశాలకు చికిత్స నిమిత్తం వెళ్లాడు. కాగా సాయిబాబా ఆలయం వద్ద కత్తితో దాడికి పాల్పడిన సమయంలో స్థానికులు హడలిపోయారు. అలాగే ప్రభుత్వ ఆసుపత్రి అత్యవసర విభాగం వద్ద రక్తపు మరకలను చూసి రోగులు, వారి బంధువులు ఉలిక్కిపడ్డారు. ఈ ఘటనపై టూ టౌన్ సీఐ వెంకటేశ్వర్లును వివరణ కోరగా... తాము ఆస్పత్రికి చేరుకునేలోగా క్షతగాత్రులు చికిత్స నిమిత్తం వెళ్లిపోయారన్నారు. విచారణ చేస్తున్నామని తెలిపారు.



ఈ స్థలంలోకి ప్రవేశిస్తే..!

● శిక్షార్హులంటూ జగనన్న లే అవుట్‌లో హెచ్చరిక బోర్డు

రేణిగుంట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): 'ఈ స్థలం కోర్టులో ఉన్నది. ఇందులో ప్రవేశించే వారు శిక్షకు అర్హులు' అంటూ జగనన్న లే అవుట్‌లో హెచ్చరిక బోర్డు వెలిసింది. ఇది లబ్ధిదారులను ఆందోళనకు గురిచేస్తోంది. రేణిగుంట మండలం జీపాళెం పంచాయతీ కుప్రకాలువ సమీపంలోని పద్మానగర్‌లో వైసీపీ ప్రభుత్వంలో జగనన్న లే అవుట్‌ను ఏర్పాటు చేసి పలువురికి ఇంటి స్థలాలను కేటాయించారు. ఇళ్ల స్థలాలకు పోను ఉద్యానవనం కోసం ఎకరా వదిలిపెట్టారు. ప్రస్తుతం పలువురు ఇళ్లు నిర్మించుకున్నారు. ఈ నేపథ్యంలో కోర్టు వివాదమంటూ బుధవారం హెచ్చరిక బోర్డు పెట్టడంతో లబ్ధిదారులు ఆందోళనకు గురయ్యారు. ఈ బోర్డులో ఉన్న నెంబరుకు ఫోను చేయగా కొత్తపాళేనికి చెందిన సుబ్రమణ్యంగా తెలిసింది. 'నలభై ఏళ్ల క్రితం ఇందిరాగాంధీ హయాంలో రైతులకు వ్యవసాయ భూములను పంపిణీ చేసి పట్టాలిచ్చారు. ఇందులో మా తల్లి నాగభూషణం పేరిట భూమి ఉంది. ఇక్కడ వైసీపీ ప్రభుత్వం జగనన్న లే అవుట్ ఏర్పాటుకు భూసేకరణ చేసి ఎకరాకు రూ.32లక్షల పరిహారం ఇచ్చింది. మా భూమికి ఎటువంటి పరిహారం ఇవ్వకుండా రెండేళ్లుగా తహసీల్దారు కార్యాలయం చుట్టూ తిప్పించుకున్నారు. దీంతో కోర్టును ఆశ్రయించాను' అని సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ విషయమై తహసీల్దారు శ్యామ్‌ప్రసాద్‌ను వివరణ కోరగా.. హెచ్చరిక బోర్డు విషయం తన దృష్టికి వచ్చిందన్నారు. వీఆర్వోతో విచారణ జరిపించినట్లు తెలిపారు. కోర్టు ఉత్తర్వులుంటే తమకు చూపించాలని లేనిపక్షంలో ఆ బోర్డును తొలగిస్తామని స్పష్టం చేశారు.

డీఎస్సీ ఉచిత కోచింగ్‌కు ప్రవేశ పరీక్షను పక్కాగా నిర్వహించండి

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 6: ఉచిత మెగా డీఎస్సీ కోచింగ్‌కు ప్రవేశ పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. ఈ ప్రవేశ పరీక్ష నిర్వహణపై బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లో ఆయన సమీక్షించారు. జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు సాంఘిక సంక్షేమ, గిరిజనశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈనెల 10వ తేది ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు చెప్పారు. తిరుపతిలోని చదలవాడ రమణమ్మ ఇంజనీరింగ్ కళాశాల, కరకంబాడి రోడ్డులోని శ్రీరామ ఇంజనీరింగ్ కళాశాల, పుత్తూరు సమీపంలోని సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తున్నట్లు వివరించారు. అభ్యర్థులు తమ హాల్‌టిక్కెట్లను 'జ్ఞానభూమి' పోర్టల్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు ప్రత్యేక హెల్ప్ లైన్ నెంబరు 70130 08498ను సంప్రదించాలని తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలను అధికారులు కల్పించాలని ఆదేశించారు. ఉచిత శిక్షణ కోసం జిల్లా నుంచి 539 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు చెన్నయ్య, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

టూరిజం డీవీఎంగా శ్రీనివాసరావు


నూతన డీవీఎంను పరిచయం చేసుకుంటున్న టూరిజం ఉద్యోగులు

తిరుపతి అర్బన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పర్యాటకాభివృద్ధి సంస్థ జిల్లా డివిజనల్ మేనేజర్‌గా సీహెచ్ శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఇప్పటి వరకు ఉన్న గిరిధర్‌రెడ్డిని మాతృసంస్థ(ఆర్టీసీ)కు బదిలీ చేశారు. నెల్లూరు డీవీఎంగా ఉన్న శ్రీనివాసరావును తిరుపతికి బదిలీ చేశారు. బుధవారం ఉదయం జూపార్కు రోడ్డులోని కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది ఆయన్ను మర్యాదపూర్వకంగా కలసి పరిచయం చేసుకున్నారు. ఆయన మాట్లాడుతూ సమన్వయంతో పని చేసి సంస్థ ఆదాయానికి, అభివృద్ధికి ప్రాధాన్యత ఇద్దామని కోరారు.

సదరన్ డిస్కం బోర్డు లీగల్ కౌన్సిల్‌గా మధుసూదన రెడ్డి



తిరుపతి(ఆటోనగర్)నవంబరు6(ఆంధ్రజ్యోతి): ఏపీఎస్పీడీసీఎల్ ఆపరేషన్ సర్కిల్ తిరుపతి బోర్డు లీగల్ కౌన్సిల్‌గా ఎన్.మధుసూదన రెడ్డిని నియమిస్తూ బుధవారం డిస్కం సీఎండీ కె.సంతోషరావు ఉత్తర్వులు జారీ చేశారు. మధుసూదన్ రెడ్డి తిరుపతి ఆపరేషన్ టౌన్ డివిజన్‌లో బోర్డు లీగల్ కౌన్సిల్‌గా విధులు నిర్వహిస్తారు. 2027 అక్టోబరు 31 వరకు ఆయన మూడేళ్ల పాటు విధులు నిర్వహిస్తారు.


దక్షిణామూర్తి సన్నిధిలో హుండీ లెక్కింపు

ముక్కంటి ఆలయ హుండీ లెక్కింపు

● 40 రోజుల్లో రూ.1.94 కోట్ల ఆదాయం

శ్రీకాళహస్తి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : శ్రీకాళహస్తీశ్వరాలయంలోని గురు దక్షిణామూర్తి సన్నిధిలో బుధవారం హుండీ లెక్కింపు జరిగింది. రూ. 1,94,41,581 నగదు హుండీ ద్వారా వచ్చింది. ఇక బంగారం 85.100 గ్రాములు, వెండి 607.10 కిలోలు, ఇతర దేశాలకు చెందిన 145 నోట్లు విదేశీ నగదు వచ్చింది. సెప్టెంబరు 25వ తేదీన చివరిగా హుండీ లెక్కింపు జరిగింది. 40 రోజుల తర్వాత బుధవారం జరిగిన లెక్కింపులో వచ్చిన ఆదాయం 1.94 కోట్లుగా అధికారులు ప్రకటించారు.

నేడు రెండు సబ్ స్టేషన్లకు శంకుస్థాపన

● వర్చువల్‌గా భూమిపూజ చేయనున్న సీఎం చంద్రబాబు

తడ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రెండు 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణానికి గురువారం ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు వర్చువల్‌గా భూమిపూజ నిర్వహించనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 14 సబ్ స్టేషన్ల నిర్మాణ శంకుస్థాపనలో భాగంగా తడ మండలం మాంబట్టు, రేణిగుంట మండలం తూకివాకంలో రెండు సబ్‌స్టేషన్ల నిర్మాణాలకు భూమిపూజ జరగనుంది. ఇందులో మాంబట్టు సబ్ స్టేషన్‌కు రూ.43.50 కోట్లు, తూకివాకం సబ్‌స్టేషన్‌కు రూ.76.89 కోట్లను ప్రభుత్వం కేటాయించింది. ఈ మేరకు గురువారం సూళ్లూరుపేట మండలం మన్నారుపోలూరు 220 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో శంకుస్థాపనకు ఏర్పాట్లు చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వర్చువల్‌గా మంగళగిరిలో శంకుస్థాపన చేసిన అనంతరం ఇక్కడ జిల్లా జాయింట్ కలెక్టర్ శుభంబన్సాల్, సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ చేతుల మీదుగా భూమిపూజకు ఏర్పాట్లు చేశామని ట్రాన్స్‌కో డీఈ బలరామమూర్తి తెలిపారు.